నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 27-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :31 సంచిక:225 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

చిందర వందరల నడుమ
నందా తాత్కాలికముగ నంతవ్యంబౌ
సుందర ప్రధాన పదవిని
పొందెను మన భారతంబు పుణ్య ఫలముగన్

(27-5-1964 తాత్కాలిక ప్రధానిగా నందా ప్రమాణ స్వీకారం)

చురక

కొద్దిమంది సంపన్నులే
కొల్లగొడితే సంపదంతా
వికసిత భారత్ అనే
విజన్ కాదా పెద్ద వింత
ప్రపంచంలో ఆర్థికంగా
పరుగు పెడితే మనదేశం
అభివృద్ధికి దూరమేలా
అట్టడుగున జనవాసం

-వేల్పుల నారాయణ
9440433475



ముంబయిలో భారీ వర్షాలు.. 107 ఏళ్ల నాటి రికార్డు బ్రేక్..!

న్యూఢిల్లీ, మే 26: ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీ వర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయికి నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుండగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. ఆ తర్వాత 1962, 1971లో అదే రోజుల్లో వచ్చినట్లుగా పేర్కొంది.

రుతుపవనాల ఆగమనంతో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల మధ్య కొలాబాలో 105.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత శాంటాక్రూజ్ (55 మిల్లీమీటర్లు), బాంద్రా 68.5, జుహు విమానాశ్రయం 63.5, చెంబూర్ 38.5, విక్రోలి 37.5 , మహాలక్ష్మి 33.5, సియోన్ 53.5లో మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయినట్లు వాతావరణశాఖ తెలిపింది. జడివాన కారణంగా ముంబయిలోని అనేక లోతట్టు ప్రాంతాలతో పాటు రైల్వే ట్రాక్‌లు నీటితో నిండిపోయాయి. దాంతో ఉదయం రోడ్లు, స్థానిక రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ముంబయిలో కొన్ని గంటల పాటు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. సెంట్రల్ రైల్వే నెట్‌వర్క్‌లోని మసీదు, బైకుల్లా, దాదర్, మాటుంగా, బద్లాపూర్ రైల్వే స్టేషన్లలో భారీ వర్షాల కారణంగా ట్రాక్‌లు నీట మునిగాయి.

కింగ్స్ సర్కిల్, మంత్రాలయ, దాదర్ టీటీ ఈస్ట్, పరేల్ టీటీ, కలచౌకి, చించ్పోక్లి, దాదర్ స్టేషన్ వంటి లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. సెంట్రల్ రైల్వే హార్బర్ లైన్‌లోని వడాలా రోడ్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ మధ్య సబర్బన్ రైలు సర్వీసులు ఉదయం 10.25 గంటల నుంచి నిలిచిపోయాయి. వర్షం కారణంగా దృశ్యమానత తగ్గిందని.. ఫలితంగా ట్రాఫిక్ నెమ్మదించిందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో సముద్రంలో అలలు 4.75 మీటర్లకు పెరగవచ్చని బీఎంసీ పేర్కొంది. సాయంత్రం 5.18 గంటలకు 1.63 మీటర్లు, మంగళవారం ఉదయం 5.21 గంటలకు 0.04 మీటర్ల వరకు అలలు పెరిగే అవకాశం పేర్కొంది.

నెలాఖరులో మంత్రివర్గ విస్తరణపై ప్రకటన..

-సామాజికవర్గాల వారీగా కసరత్తు
-వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీలకు అవకాశం?
-మంత్రివర్గ విస్తరణపైనా చర్చలు
-మరో రెండు రోజులు ఢిల్లీలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పీసీసీ కార్యవర్గం ఎంపికకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్టు ఆ పార్టీ వర్గాల తాజా సమాచారం. ఈ నెలాఖరున పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణను కూడా అధిష్ఠానం తేల్చేపనిలో ఉన్నట్టు తెలిసింది. నీతి అయోగ్ సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటకు పైగా వీరి మధ్య చర్చలు సాగాయి. రేవంత్‌తో పాటు పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు. సోమవారం ఉదయం వేణుగోపాల్‌తో కలిసి రాహుల్‌గాంధీని కూడా సీఎం రేవంత్‌రెడ్డి కలువనున్నారని తెలిసింది. అలాగే మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే అపాయింట్‌మెంట్ లభించడంతో మరో రెండు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోనే ఉంటారని తెలిసింది. మూడు రోజులుగా ఢిల్లీలో మకాం వేసిన పీసీసీ అధ్యక్షు డు మహేశ్ కుమార్‌గౌడ్ ఇప్పటికే పీసీసీ కార్యవర్గం ఎంపికపై తమ ప్రతిపాదనలను పార్టీ పెద్దల ముందు ఉంచినట్టు తెలిసింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కూడా కలిసి కార్యవర్గం ఎంపి క ప్రతిపాదనలపై మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించినట్టు తెలిసింది.పీసీసీ అధ్యక్షుడు, అధిష్ఠానం సంయుక్తంగా చేసిన కసరత్తుపై తుదిగా సీఎం రేవంత్‌రెడ్డి తో అధిష్ఠానం చర్చించాక, పీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ రెండింటిపై స్పష్టత రానున్నదని ఈ వర్గాల సమాచారం. పీసీసీ కార్యవర్గం ఖరారు దాదాపు ఒక కొలిక్కి రావడంతో ఈ నెలాఖరున ప్రకటించే అవకాశం ఉన్నట్టు తె లిసింది. ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఈ మూడు పదవులలో ఉన్న సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ లో, ప్రభుత్వంలో ప్రాతినిధ్యం లభించని సామాజిక వర్గాలకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించబోతున్నట్టు తెలిసింది. ఎస్టీ, ఎస్సీ (మాదిగ), మైనార్టీ ఈ మూడు సామాజిక వర్గాలకు చెందిన వారికి వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం దక్కబోతున్నట్టు తెలిసింది. అలాగే కార్యవర్గంలో కీలకమైన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులుగా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని కసరత్తు చేసినట్టు తెలిసింది.

వచ్చే నెలలో మంత్రివర్గ విస్తరణ?

పీసీసీ కార్యవర్గం ఎంపిక కొలిక్కి రావడంతో పార్టీ అధిష్ఠానం మంత్రివర్గ విస్తరణపై ఇక దృష్టి సారించినట్టు తెలిసింది. ఈ నెలఖారున పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించి, వచ్చే నెల జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం సూచనప్రాయంగా అంగీకరించినట్టు ఈ వర్గాల సమాచారం. మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశం వల్లనే జాప్యానికి కారణంగా చెబుతున్నారు.డిప్యూటీ సీఎం, స్పీకర్ రెండు కీలక పదవులు మాల సామాజిక వర్గానికి అవకాశం కల్పించడంతో కనీసం మంత్రివర్గంలో అయినా తమకు ప్రాధాన్యత కల్పించాలని మాదిగ సామాజిక వర్గం చేస్తోన్న డిమాండ్‌ను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకొని ఆ దిశగా కసరత్తు చేస్తోన్నట్టు తెలిసింది. మంత్రివర్గంలో ఇప్పటికే మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రి దామోదర రాజనరసింహకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఆయన తమ సామాజిక వర్గం కాదని ఆరుగురు మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేల వాదనతో అధిష్ఠానం ఏకీభవించినట్టు తెలిసింది. దీంతో మాదిగ సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలోకి ఎవరిని తీసుకోవాలనే అంశంపై సందిగ్ధత నెలకొన్నట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీకి వెళ్లిన సందర్భంగా ఆరుగురు మాదిగ ఎమ్మెల్యేలు మరోసారి తమ డిమాండ్‌పై అధిష్ఠానంతో చర్చించాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. మరోవైపు అధిష్ఠానం పెద్దలకు కూడా లిఖిత పూర్వకంగా వారు లేఖ రాసారు.మంత్రివర్గ విస్తరణలో తమ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తూ సిఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ అందజేసిన విషయం తెలిసిందే. వీరిలో ఎమ్మెల్యేలు మందుల సామేల్ (తుంగతుర్తి), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), వేముల వీరేశం (నకిరేకల్), తోట లక్ష్మీకాంతరావు (జుక్కల్), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి), కాలె యాదయ్య (చేవెళ్ల)లు ఉన్నారు. తమ కోటాలో మంత్రివర్గంలో ఉన్న దామోదర రాజనర్సింహా మాదిగ కాదని, ఆయనది ఉపకులమని వారు తమ లేఖలో పేర్కొన్నారు. మాదిగ సామాజిక వర్గ జనాభా రాష్ట్రంలో 2011 జనగణన ప్రకారం 33 లక్షల మంది ఉన్నారని, మాలలకు డిప్యూటీ సిఎం, స్పీకర్ పదవి దక్కడంతో మంత్రివర్గంలో అయినా తమకు చోటు కల్పించాలని ఆ లేఖలో వారు పేర్కొన్నారు.

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్).: తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు గుడ్‌న్యూస్. తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. మరో మూడు రోజుల్లో రుతుపవనాలు మిగితా ప్రాంతాలను కూడా తాకే అవకాశం ఉందని పేర్కొంద. ఉత్తర తెలంగాణపై ద్రోణి కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సోమవారం నుంచి గురువారం వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద భీమా

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మే 26: విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు కార్మికునికి కోటి రూపాయల ప్రమాద పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం ప్రజా భవన్ లో ఎన్ పి డిసిఎల్ సి పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు తో పాటు విద్యుత్ శాఖలో నరేష్ సతీమణికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యం అయ్యింది అన్నారు.

గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా మరియు కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు , మానవీయ కోణానికి బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యం అయ్యింది అన్నారు.

గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా మరియు కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు , మానవీయ కోణానికి అద్దం పడుతుంది అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.

కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్ పి డిసిఎల్ సి ఎండి వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎనిమిది రాజ్యసభ స్థానాలకు వచ్చే నెల 19న పోలింగ్

న్యూ డిల్లీ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రెండు రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న ఎనిమిది రాజ్యసభ స్థానాల కు వచ్చే నెల 19న పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగియగానే అదేరోజు ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అసోం లో రెండు, తమిళనాడులో ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి.అసోంలో రాజ్యసభ సభ్యులు రంజన్ దాస్, బీరేంద్ర ప్రసాద్ బైస్యల పదవీకాలం జూన్ 14న ముగియనుంది. అదేవిధంగా తమిళనాడులో ఆరుగురు సభ్యులు అన్బుమణి రామదాస్, ఎం షణ్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పీ విల్సన్, వైకో జూలై 24న పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన జూన్ 2న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.నామినేషన్‌ల దాఖలుకు జూన్ 9 వరకు గడువు ఇవ్వనున్నారు. జూన్ 10 నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. అభ్యర్థిత్వాన్ని వదులుకోవడానికి తుది గడువు జూన్ 12. జూన్ 19న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 23తో ఈ రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

నేటితో ముగియనున్న సరస్వతి పుష్కరాలు

కాళేశ్వరం, మే 26: కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు నేటితో ముగియనున్నాయి. ఆచివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. దీపాలు వెలిగించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు.

కాగా సోమవారం రాత్రి 7:45 గంటలకు నవరత్నమాల హారతితో పుష్కరాలు ముగియనున్నాయి. పుష్కరాల ముగింపు సందర్భంగా వీఐపీ ఘాట్ వద్ద ఇవాళ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సాయంత్రి 6 గంటల నుంచి వేద స్వస్తి కార్యక్రమం, బ్రహ్మశ్రీ నాగ ఫణిశర్మ సందేశం, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని అధికారులు తెలిపారు. రాత్రి 7.46 నుంచి 7.54 వరకు డ్రోన్ షో నిర్వహించనున్నారు. పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు ఆదివారం నాడు.

కాగా, ఆదివారం నాడు 3.50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. ఇవాళ సోమవారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాళేశ్వరం వెళ్లే రూట్‌లో భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు 15కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీనికి తోడు ప్రైవేటు వాహనాలను ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు, పుష్కర ఘాట్ల వరకు అనుమతించడం సమస్య తీవ్రతను మరింత పెంచింది. చాలామంది భక్తులు మహారాష్ట్ర వైపు పుణ్యస్నానాలు చేసి శివుడిని దర్శించుకోకుండానే తిరిగి వెళ్లిపోయారు.

కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో వీఐపీల సేవలో తరించిన అధికారులు.. సామాన్యులను పట్టించుకోకపోవడం విమర్శలకు దారి తీసింది.

నంబాలను సజీవంగా పట్టుకుని ఎన్ కౌంటర్ : లేఖ విడుదల చేసిన మావోయిస్టులు



న్యూఢిల్లీ, మే 26:మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. మావోయిస్టు జోనల్ కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. లేఖలో నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన కారణాల్ని అందులో పేర్కొన్నారు

లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఎన్ కౌంటర్ జరిగింది. 6నెలలుగా కేశవరావు మాడ్ ప్రాంతంలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలుసు. కేశవరావు టీమ్‌లో ఉన్న అరుగురు ఇటీవలే లొంగిపోయారు. వాళ్లు ఇచ్చిన సమాచారంతో ఎన్ కౌంటర్. యూనిఫైడ్ కమాండో సభ్యుడు దేశ ద్రోహిగా మారాడు. రీకీతో సహా పలువురు ద్రోహం చేయడంతో ఈ ఎన్ కౌంటర్.

ఎన్‌కౌంటర్ ముందు రోజు నుంచి 20వేల మంది బలగాలు మా ప్రాంతాన్ని చుట్టి ముట్టాయి. 10 గంటల్లో ఐదు ఎన్ కౌంటర్లు జరిపాయి. 60 గంటల పాటు బలగాలు మమ్మల్ని నిర్బంధించాయి. కేశవరావుని కాపాడుకునేందుకు 35మంది ప్రాణాల్ని అడ్డుపెట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సురక్షింతంగా బయటపడ్డారు. నంబాలను సజీవంగా పట్టుకుని ఎన్ కౌంటర్ చేశారు.మమ్మల్ని వదిలి కేశవరావును సురక్షిత ప్రాంతాన్ని తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని వదిలి కేశవరావు బయటకు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. నాయకత్వాన్ని ముందుండి మాతోటే నడిచారు. ప్రాణాల్ని ఫణంగా పెట్టారు. మా నాయకుడిని కాపాడుకోవడంలో మేం విఫలమయ్యాం. కాల్పులు విరణమకు అంగీకరించాం. కాల్పులు జరపలేదు. కానీ కేంద్రం మాతో చర్చలు జరిపేందుకు అంగీకరించలేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

మహారాష్ట్రలో క్రమంగా పెరుగుతున్న మహమ్మారి కోవిడ్ కేసులు

ముంబై మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బి;: మహారాష్ట్రలో మహమ్మారి కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం 43 కొత్త కోవిడ్-19 కేసులు నమోదయ్యాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 209కి చేరుకుందని తెలిపింది. తాజాగా బయటపడిన కేసుల్లో ముంబైలో 35, పూణేలో 8 కొత్త కేసులు నమోదయ్యాయి. జనవరి నుండి మహారాష్ట్రలో మొత్తం 300 కోవిడ్-19 కేసులు నమోదయ్యాయి. ఇందులో ముంబైలోనే ఏకంగా 248 కేసులు నమోదయ్యాయి. మొత్తం బాధితుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సమిష్టిగా కృషి చేయాలి.. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్, మే 26: నిజామాబాద్ ను సంపూర్ణ అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబ ంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమిష్టిగా, అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాలలోని ప్రతీ సభ్యురాలి విద్యార్హతలు గుర్తిస్తూ, నిరక్షరాస్యులుగా ఉన్న వారికి చదవడం, రాయడం నేర్పించాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్రంలోనే తొలిసారిగా సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సమగ్ర శిక్ష, వయోజన విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇందూరు అక్షరం లక్ష్మి పేరుతో రూపొందించిన యాప్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఐడీఓసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి సోమవారం ఆవిష్కరించారు.సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా యాప్ ను రూపొందించడం పట్ల కలెక్టర్ సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలలో సుమారు 3.40 లక్షల మంది సభ్యులు కొనసాగుతున్నారని కలెక్టర్ గుర్తు చేశారు.

చెత్త సమస్యలను పరిష్కరించేందుకు ప్రీ మాన్సూన్ స్పెషల్ డ్రైవ్

-జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్, మే 26:బస్తీలు, కాలనీల్లో చెత్త సమస్యలను పరిష్కరించడంతో పాటు పరిశుభ్రకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రీ మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను మేయర్ ప్రకటించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా బంజారాహిల్స్ వార్డులోని అన్ని బస్తీలు, కాలనీల్లో14 మంది సభ్యులతో కూడిన బృందాలు పర్యటించి చెత్తకుప్పలు తొలగించడం, నిర్మాణ వ్యర్థాలను తొలగించేలా అవగాహన కల్పించడం, దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నారని అన్నారు.శానిటేషన్ విషయంలో ఫిర్యాదులు లేకుండా ప్రతి వీధిలో క్రమం తప్పకుండా చెత్త తొలగింపు జరిగేలా చూస్తామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ఇండ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా రోడ్లపై పారవేయడమే అత్యంత ప్రధానమైన సమస్యగా మారిందని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పేర్కొ న్నారు. శానిటేషన్ అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యం ద్వారానే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా జలమండలి జీఎం హరిశంకర్ మాట్లాడు తూ.. వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసేం దుకు జలమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని అన్నారు. దీనిలో భాగంగా మ్యాన్ హోళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మ్యాన్ హోళ్ల మూతలను తొలగించవద్దని కోరారు. వారంరో జుల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని చెప్పారు. సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఆధునిక భారత రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

(27 మే "జనహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి" సందర్భంగా)

ఆధునిక భారత రూపశల్పి, స్వతంత్ర భారత తొలి ప్రధాన మంత్రి, అత్యంత దీర్ఘకాలం పాటు ప్రధానిగా విశేష సేవలు అందించిన జవహర్‌లాల్ నెహ్రూ వ్యక్తిత్వం మహోన్నతం, ఆయన చూపిన దారి నేటికీ అనుసరణీయం, అభినందనీయం. పిల్లల్ని అమితంగా ప్రేమిస్తూ, నేటి బాలలే రేపటి భావిభారతో పౌరులని నినదించిన నెహ్రూను బాలలు 'చాచా నెహ్రూ'గా ముద్దుగా పిలుచుకుంటారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన నెహ్రూను ప్రజలు 'పండిట్' అంటూ నోరారా పిలుచుకోవడం నేటికీ అలవాటుగా మారింది, తన పేరుకు ముందు ఇంటి పేరు వలె నిలిచింది. అత్యంత మేధావి, రాజనీతిజ్ఞుడు, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, పరిపాలనాదక్షుడు, న్యాయవాది, దేశానికి మార్గనిర్దేశనం చేసిన నాయకుడు అయిన జవహర్‌లాల్ నెహ్రూ 14 నవంబర్ 1889 రోజున ప్రయాగ్‌రాజ్‌లోని సంపన్న కాశ్మీరీ కుటుంబంలో జన్మించారు.

తొమ్మిదేళ్ల పాటు జైలు జీవితం:

ప్రఖ్యాత న్యాయవాది అయిన తండ్రి మోతీలాల్ నెహ్రూ చొరవతో పాఠశాల విద్యను ఇంట్లోనే ట్యూటర్స్ సహాయంతో పూర్తి చేసి, హరో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్య అనంతరం కేంబ్రిడ్జ్ ట్రినిటీ కళాశాలలో నేచురల్ సైన్స్‌లో పట్టాను, లండన్ ఇన్నర్ టెంపుల్ కళాశాల నుంచి బారిస్టర్ డిగ్రీని పొందారు. చదువుల తర్వాత ఏడు ఏండ్లు ఇంగ్లాండ్‌లో గడిపిన నెహ్రూ తిరిగి భారత్‌కు చేరారు. 1916లో కమలా కౌల్‌ను వివాహమాడి 1917లో ఏకైక కూతురు ఇందిరా ప్రియదర్శినికి జన్మనిచ్చారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన నెహ్రూ ఆ వృత్తిలో ఏకాగ్రతను పెట్టలేక పోయారు. 1916లో తన కన్న 20 ఏండ్లు పెద్దవాడైన గాంధీని మొదటి సారి కలుసుకున్నారు. తొలి కలయికలో గాంధీ మనసును నెహ్రూలు ప్రభావితం చేయలేక పోయినా, తర్వాత స్వతంత్ర ఉద్యామాల్లో ఆయన ప్రియ శిష్యుడిగా, అప్రకటిత వారసుడిగా మారిపోయారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కార్యదర్శిగానే కాకుండా పలు మార్లు దానికి అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి పలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని పలు మార్లు జైలు పాలైన నెహ్రూ జీవితకాలంలో దాదాపు తొమ్మిది ఏండ్ల పాటు, అనగా 3,259 రోజులు జైలులోనే గడిపారు. అల్మోరా జైలులో ఉన్నప్పుడే తన ఆత్మకథను రచించారు. అందరికీ తెలిసిన "డిస్కవరీ ఆఫ్ ఇండియా"తో పాటు "గ్లిమ్‌సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ" అనబడే ప్రఖ్యాత పుస్తకాలను రచించారు.

ఆధునిక భారత రూపశిల్పి:

15 ఆగష్టు 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తొలి ప్రధానిగా ఎన్నికై భారతదేశ అభివృద్ధికి గట్టి పునాదులు వేశారు. ప్రపంచ స్థాయి ఐఐటీలు, ఐఐఎంలు, ఏఐఐఎంఎస్ లాంటి పలు ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పారు. శాస్త్రసాంకేతిక విద్య, మహిళా విద్య, ప్రాంతీయ భాషల్లో విద్యాబోధనలు, లౌకిక/సాంస్కృతిక/మానవీయ/నైపుణ్య/వృత్తిపరమైన విద్యలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ యువతకు చక్కటి మార్గాన్ని చూపడంలో కృతకృత్యులు అయ్యారు. 15 ఆగష్టు నుంచి తుది శ్వాస విడిచే వరకు, అనగా 27 మే 1964 వరకు దేశ ప్రధానిగా 16 ఏండ్ల 286 రోజుల పాటు దీర్ఘకాలం సేవలు అందించారు. దేశ విభజన సమయంలో మత ప్రాతిపదికన విభజనలు వ్యతిరేకించిన నెహ్రూను లార్డ్ మౌంట్‌బాటెన్ ఒప్పించగలిగారు.

1962లో సరిహద్దు వివాదాల కారణంగా చైనాతో జరిగిన యుద్ధంలో భారత్ ఓటమి పాలుకావడాన్ని జీర్ణించుకోలేక మధనపడుతూ తన ఆరోగ్యాన్ని కూడా కోల్పోయారు మన పండిట్ నెహ్రూ. భారత ప్రజాస్వామ్య పటిష్టత, ముందు చూపు కలిగిన పాలన, సామాజిక న్యాయాలే లక్ష్యాలుగా స్వతంత్ర భారత సమగ్రాభివృద్ధికి గట్టి పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ జీవితం నేటి యువతకు కూడా దారి దీపంగా నిలుస్తున్నది, దేశం కోసం త్యాగాలు చేయమని నినదిస్తున్నది.

'నెహ్రూ' పేరును 'గాంధీ'గా మార్చుకున్న వైనం:

స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రధానిగా సర్దార్ వల్లబాయ్ పటేల్‌ను నాటి కాంగ్రెస్ కోర్ కమిటీ ఎంపిక చేసినప్పటికీ గాంధీగారి చొరవతో జవహర్‌కు ఆ పదవి దక్కడం ఓ చరిత్రగా మిగిలి పోయింది. దేశ విభజన సమయంలో తన ప్రధాని పదవిని పదిలపరుచుకోవడంలో నిమగ్నమైన నెహ్రూ, దేశం పక్షాన పోరాటం చేయడంలో తగిన చొరవ చూపలేదనే విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. దేశ చరిత్రను వక్రీకరించి, అసలైన భారతీయతను తెరమరుగు చేయడానికి కృషి చేశారని కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పేరును వదిలి గాంధీ పేరును తమ ఇంటి పేరుగా మార్చుకొని, అసలైన గాంధీ వారసులను తెరమరుగు చేయడంలో సఫలం అయ్యారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు.

మహాత్మా గాంధీని ముందు పెట్టి, ఆయన మన్ననలు పొంది అప్రకటిత గాంధీ వారసుడిగా పేరు తెచ్చుకొన్న నెహ్రూ కాశ్మీర్ వివాద పరిష్కారం, పిఓకె సమస్యలను ఆదిలోనే పరిష్కరించడంలో విఫలం అయ్యారనే అపప్రథను కూడా మూటగట్టుకున్నారు.

ఏది ఏమైనా దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 3,259 రోజుల పాటు జైలులో గడిపిన నెహ్రూ జీవితం మనకు ఆదర్శం. మేధావి, సంపన్న కుటుంబంలోంచి వచ్చిన నెహ్రూ చూపిన పట్టుదల, ప్రదర్శించిన నాయకత్వ లక్షణాలు అనన్య సామాన్యమే కాదు అనుసరణీయం కూడా. 27 మే 2025 రోజున జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతిని దరుపుకుంటున్న వేళ ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయసాధనకు మనందరం కృషి చేద్దాం, భవ్యమైన దివ్య భారతాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చడానికి మన కూడా సమిధలు అవుదాం, భరతమాత ఒడిలో ప్రశాంతంగా గడుపుదాం. **– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

చట్టపరమైన విధాన బలోపేతం, మెరుగైన దిశానిర్దేశం కోసం న్యాయవాదులు, సీఈఓలతో జాతీయ సదస్సు నిర్వహించిన ఈసీఐ

న్యూఢిల్లీ, మే 26:భారత ఎన్నికల కమిషన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులతో న్యూఢిల్లీలోని ఐఐఐడీఈఎమ్‌లో నిర్వహించిన జాతీయ సదస్సును ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్.. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషిలతో కలిసి ప్రారంభించారు. భారత సుప్రీంకోర్టు సహా దేశవ్యాప్తంగా గల 28 హైకోర్టుల నుంచి సీనియర్ న్యాయవాదులు, అధికారులు, అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 36 మంది సీఈఓలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమన్వయం సాధించడం ద్వారా కొత్త సవాళ్లను మరింత సమర్థంగా ఎదుర్కోవడం కోసం ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న చట్టపరమైన విధానాన్ని బలోపేతం చేస్తూ, మెరుగైన దిశా నిర్దేశం చేసే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో వ్యవహరించేందుకూ, సమస్యల్ని విని, తగినన్ని అవకాశా లను అందించడం గురించి ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

రోజంతా జరిగిన ఈ సమావేశం ఎన్నికల కమిషన్ – ప్రముఖ న్యాయ నిపుణుల మధ్య నిర్మాణాత్మక చర్చలకు, పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడానికి చక్కని వేదికగా నిలిచింది. అందుబాటులో గల చట్టపరమైన వనరులను దేశంలో నిరంతరం మెరుగవుతున్న ఎన్నికల వ్యవస్థను న్యాయశాస్త్రానికి అనుగుణంగా ఉండేలా చేసేందుకు ఎన్నికల కమిషన్ వేసిన కీలక ముందడుగును ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సూచిస్తుంది. ఎన్నికల చట్టం, న్యాయపరమైన చర్యలు, చట్టపరమైన సంస్కరణలకు సంబంధించిన అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ, సంసిద్ధత, సామర్థ్యం, సమన్వయాన్ని మెరుగుపరచడంపై ఈ చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయి. ఈ సదస్సు నిర్వహణ ద్వారా, వివిధ న్యాయ వేదికలలో తమ చట్టపరమైన ప్రాతినిధ్య ప్రభావాన్ని మరింత బలోపేతం చేయడానికి ఎన్నికల కమిషన్ ప్రయత్నించింది.

ఎన్నికల సంఘం న్యూఢిల్లీలోని ఐఐఐడీఈఎమ్‌లో శుక్రవారం ప్రధాన ఎన్నికల అధికారులతో సమావేశాన్ని నిర్వహించింది. ఈసీఐ చేపట్టే ఐటీ వినియోగం కోసం ప్రణాళికను రూపొందించడం, దానిని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఈసీఐ సంబంధిత వ్యక్తులందరి కోసం.. అవసరమైన చట్టపరమైన నిబంధనల పరిధిలో, సంబంధిత డేటా మొత్తం ఒకే వేదిక ద్వారా అందుబాటులో ఉంచే లక్ష్యంతో కమిషన్ ఇప్పటికే 2025లోనే ఈసీఐఎన్‌ఈటీ అనే ఇంటిగ్రేటెడ్ డాష్‌బోర్డ్‌ని రూపొందించడానికి, అభివృద్ధి చేయడానికి ఒక కొత్త ప్రయత్నాన్ని ప్రారంభించింది. ఈ ప్రత్యేక ప్రయత్నం ద్వారా ఈసీఐ తన ఐసీటీ వినియోగాలన్నింటినీ ఒకే గొడుగు కింద ఏకీకృతం చేయనుంది.

ప్రభాకర్ రావుకు అమెరికా షాక్ - శరణార్థి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, మే 26: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తూ తన క్రిమినల్ మైండ్ కు పదును పెడుతున్న సంగతి విదితమే.

ఈ మేరకు ఆయన గత సంవత్సరం నవంబర్ 29న తనపై రాజకీయ కక్షతోనే తెలంగాణ ప్రభుత్వం కేసు పెట్టిందని.. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ అమెరికా ప్రభుత్వానికి పిటిషన్ అందజేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన ఇచ్చిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన అక్కడి ప్రభుత్వం ప్రభాకర్ రావును అభ్యర్థనను తోసిపుచ్చింది. తమ దేశంలో ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయం కల్పించబోమని తేల్చి చెప్పింది.

20న నాంపల్లి కోర్టులో హాజరుకావాల్సి ఉంది

మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు వచ్చే నెల 20న విచారణకు నాంపల్లి కోర్టు లో హాజరు కావాల్సి ఉంది. ఒకవేళ ఆయన కోర్టుకు హాజరు కాని పక్షంలో ప్రకటిత నేరస్థుడిగా పరిగణించే అవకాశాలు ఉన్నాయి.

కాగా, ప్రభాకర్ రావును స్వదేశానికి రప్పించడంలో ఇప్పటికే కీలక అడుగు పడింది. ఇంటర్‌పోల్ గత మార్చి 10న జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసుల అమలు ప్రక్రియను అమెరికా ప్రభుత్వం ముమ్మరం చేసింది. అయితే, ప్రభాకర్ రావును భారత్‌కు పంపించేందుకు యూఎస్ హోమ్ ల్యాండ్ అనే సెక్యూరిటీ ఏజెన్సీ సంస్థ పూర్తి బాధ్యతలు తీసుకున్నట్లుగా సమాచారం.

అంతర్జాతీయ షూటింగ్ పోటీలలో మేఘనకు పతకాల పంట

– అభినందించిన రామగుండం పోలీస్ కమిషనర్

అమరావతి, మే 26: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించి కాంస్య పతకం సాధించిన ఏసీపీ సాదుల సారంగ పాణి కుమార్తె మేఘన ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలవగా మేఘన ను ఘనంగా సత్కరించారు.

ఏసీపీ సారంగపాణి కుమార్తె సాదుల మేఘన గత కొన్ని సంవత్సరాలుగా పిస్టల్ షూటింగ్‌లో జర్మనీలో జరిగిన జూనియర్ ప్రపంచ కప్ 2023 లో జట్టు బంగారు పతకం, దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ 2023 లో వెండి పతకం, దక్షిణ కొరియాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 3 జాతీయ ఛాంపియన్‌షిప్ పతకాలు మరియు బహుళ తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పతకాలు,జూనియర్ వ్యక్తిగత కాంస్య, జూనియర్ సివిలియన్ కాంస్య, సీనియర్ జట్టు వెండి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కాంస్య పతకం సాధించడం జరిగింది

. విలువిద్యలో జాతీయ స్థాయి పోటీల్లో తన సత్తా చాట్టడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ పిల్లలను క్రీడల్లో వున్న ఆసక్తి గమనించి వారిని ప్రోత్సహించాలని, ముఖ్యంగా నిరంతరం విధులు నిర్వహించే పోలీసులు సైతం తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిమచడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు పూర్తి సహకారం అందించడం సంతోషదాయకమన్నారు.

బ్రెజిల్‌లోని బ్రసీలియాలో జరగనున్న బ్రిక్స్ సాంస్కృతిక మంత్రుల సమావేశం- 2025లో పాల్గొననున్న భారత్

న్యూఢిల్లీ, మే 26:2025 మే 26న బ్రెజిల్‌లోని బ్రసీలియాలో జరగనున్న బ్రిక్స్ సాంస్కృతిక మంత్రుల సమావేశంలో భారత్ పాల్గొననుంది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ భారత బృందానికి నాయకత్వం వహిస్తూ ఈ ఉన్నత స్థాయి మంత్రుల సమావేశంలో దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.

బ్రిక్స్ సాంస్కృతిక మంత్రుల సమావేశం.. సభ్య దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాల మధ్య పరస్పర అవగాహన, సాంస్కృతిక మార్పిడి, సహకార కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ముఖ్యమైన వేదికగా ఉంది. ఈ ఏడాది సమావేశం సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడం, సంస్థల మధ్య భాగస్వామ్యాలను పెంచడం.. బ్రిక్స్ దేశాల గొప్ప సాంస్కృతిత వైవిధ్యాన్ని రక్షించటం, ప్రోత్సహించే లక్ష్యంతో సంయుక్త సాంస్కృతిక ప్రాజెక్టులను చేపట్టటంపై దృష్టి సారించనుంది.

చర్చల సందర్భంగా భారత సాంస్కృతిక దౌత్యం, వారసత్వ సంపద రక్షణ, ప్రజల మధ్య సాంస్కృతిక మార్పిడికి సంబంధించి భారత్‌కు ఉన్న చిత్తశుద్ధిని మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రధానంగా తెలియజేయనున్నారు. ఇటీవల చేపట్టిన కార్యక్రమాలతో సహా ప్రపంచ సాంస్కృతిక వైభోగానికి భారత్ చేస్తున్న కృషిని ఆయన ప్రదర్శించనున్నారు.

ప్రదర్శన కళలు, దృశ్య కళలు, సాహిత్యం, వారసత్వ సంరక్షణ, సృజనాత్మక పరిశ్రమలు వంటి రంగాల్లో నూతన భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ సమావేశం అవకాశం అందిస్తుంది. బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా బహుళపక్ష సహకారం, సమ్మిళితత్వంతో కూడిన సాంస్కృతిక వృద్ధికి పాటుపడాలని భారత్ తెలియజేయనుంది.

అధికారిక మంత్రిత్వ స్థాయి చర్చలతో పాటు భారత్ బ్రిక్స్ దేశాలతో ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొననుంది. సాంస్కృతిక భాగస్వా మ్యాలు, మార్పిడి కార్యక్రమాలు, భాగస్వామ్యంతో కూడిన వేదుకల గురించి ఈ సందర్భంగా చర్చించనుంది.

దృఢమైన సాంస్కృతిక ఫ్రేమ్‌వర్క్, సాంస్కృతికపరమైన చర్చలను ప్రోత్సహించేందుకు.. మరింత సమ్మిళితత్వం, సామరస్యంతో కూడిన ప్రపంచం కోసం బ్రిక్స్ దేశాలతో కలిసి దగ్గరగా పనిచేసేందుకు భారత్ నిబద్ధతతో ఉంది.

ఇద్దరు మహిళా రోగులకు ప్రభుత్వ ఆసుప్రతిలో అరుదైన శస్త్రచికిత్స

కర్నూల్, మే 26: కర్నూలు జిజిహెచ్ లో రెండు అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతం చేశారు వైద్యులు. ఈ సందర్భంగా సోమవారం జి జి హెచ్ లు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సర్జరీ విభాగంలో ఆత్మకూరు నియోజకవర్గం పాములపాడు చెందిన 15 ఏళ్ల ఎలిషా రాణి వాంతుల్లో రక్తస్రావం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు పరీక్ష నిర్వహించగా అన్నవాహిక వేరిసెస్‌తో కూడిన పోర్టల్ హైపర్‌టెన్షన్‌గా నిర్ధారణ అయ్యింది. హెమోగ్లోబిన్ 6 గ్రాములు, ప్లేట్లెట్ కౌంట్ 60,000గా ఉండడంతో ఎండోస్కోపిక్ బ్యాండ్ లిగేషన్ చేశారు. అనంతరం శస్త్రచికిత్సా పరిశీలనలో స్ప్లీనోరీనల్ షంట్ శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ప్లేట్లెట్ కౌంట్ 5 లక్షలకు పెరిగింది. శస్త్రచికిత్సానంతరకాలం అనుకూలంగా సాగింది ,లక్షణాలు పూర్తిగా తగ్గిపోయాయి అని ఆసుపత్రి సూపర్డెంట్ వెల్లడించారు.

ఇంకా అనంతపురం జిల్లా, బాల వెంకటాపురం గ్రామానికి చెందిన మరొక పేషెంట్ 29 ఏళ్ల రోగిని గర్భాశయ రక్తస్రావంతో ఆసుపత్రికి వచ్చారు, ఇది పోర్టల్ హైపర్‌టెన్షన్‌కు అరుదైన ప్రదర్శన. ఎండోస్కోపీలో ఈమెకు కూడా అన్నవాహిక వేరిసెస్ గుర్తించి బ్యాండ్ లిగేషన్ అనంతరం శస్త్రచికిత్సా పరిశీలనలో పెద్ద పరిమాణంలో కొల్లాటెరల్స్ ,పోర్టల్ క్యావెర్నోమా గుర్తించబడినట్లు తెలిపారు. స్ప్లీనెక్టమీ నుంచి నిర్వహించబడగా, స్ప్లీన్ బరువు 1.5 కిలోలుగా నమోదు అయ్యింది. ప్రాథమికంగా 50,000గా ఉన్న ప్లేట్లెట్ కౌంట్ ఆపరేషన్ అనంతరం 4 లక్షలకు పెరిగింది. శస్త్రచికిత్సానంతర కాలం ప్రశాంతంగా సాగింది

ఈ శస్త్రచికిత్సలను డాక్టర్ రామకృష్ణ నాయిక్ నిర్వహించారు వీరికి తోడుగా ప్రొఫెసర్ డాక్టర్ జయరాం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్ బాషా, డాక్టర్ ప్రణీత్, పీజీలు కూడా శస్త్రచికిత్స బృందంలో భాగమయ్యారు అనస్తీషియా విభాగాన్ని ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ నేతృత్వం వహించగా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళి ప్రభాకర్ , అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రఘు ప్రవీణ్, డాక్టర్ సంధ్యా కీలక పాత్ర పోషించారు. వీరందరికీ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పి. హరిచరణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శస్త్రచికిత్స బృందాన్ని అభినందించినట్లు తెలిపారు.

ఇకపై అది కడప జిల్లానే - పేరు మార్చిన ప్రభుత్వం

అమరావతి, మే 26:వైఎస్సార్ జిల్లా పేరును మారుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా పేరును కడప జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం జీఓలో పేర్కొంది.

వైఎస్సార్ జిల్లాకు కడప పేరును కలపాలని గతంలోనే రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. కాగా 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప జిల్లాకు వైఎస్సార్ కడప జిల్లాగా పేరు పెట్టిన విషయం తెలిసిందే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మీద ఆయన సొంత జిల్లాకు పేరు పెట్టారు. కానీ, ఇప్పుడు ఆ పేరును తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

కడపలో పసుపు సైనికుడిలా.. మంత్రి నిమ్మల

అమరావతి, మే 26:కడప జిల్లాలో తెలుగు దేశం పార్టీ మహానాడుకు సర్వం సిద్ధమైంది. మంగళవారం నుంచి జరగబోయే టీడీపీ మహానాడుకు మంత్రులు కడపకు బయలుదేరి వెళ్తున్నారు. ఇప్పటికే చేరుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు మహానాడు ప్రాంగణం వద్ద స్వయంగా పనులు చేపట్టారు. పార పట్టుకుని మట్టి పనులు చేశారు. తాను ఒక కార్యకర్తనే అనే విషయానే చెప్పకనే చెప్పారు. వర్షం వల్ల మహానాడు ప్రాంగణంలోకి నీళ్లు చేరాయి. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీనర్ మంత్రి నిమ్మల ఈ విషయాన్ని గమనించి స్వయంగా పార పట్టి సభా ప్రాంగణంలో మట్టిని చదును చేశారు. మరోవైపు మంత్రి సవిత కూడా సైకిల్‌పై మహానాడుకు బయలుదేరారు. పార్టీ కార్యకర్తలతో కలిసి సైకిల్ తొక్కుతూ బయలుదేరారు .

రెండు దశాబ్దాల గుజరాత్ పట్టణ ప్రగతి పథం వేడుకలకు హాజరు కానున్న ప్రధాని

న్యూఢిల్లీ, మే 26:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 26, 27 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా తొలి రోజున ఉదయం ఆయన దాహోద్‌లో 11:15 గంటలకు రైలు ఇంజన్ల తయారీ కర్మాగారాన్ని దేశానికి అంకితం చేస్తారు. అటుపైన విద్యుత్ రైలింజన్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత నగరంలో దాదాపు రూ.24,000 కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

ప్రధానమంత్రి అక్కడి నుంచి భుజ్‌కు వెళ్లి సాయంత్రం 4 గంటలకు రూ.53,400 కోట్లకుపైగా విలువైన వలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఇక్కడ కూడా ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఈ కార్యక్రమాల అనంతరం ప్రధానమంత్రి గాంధీనగర్ వెళ్తారు. అక్కడ 27వ తేదీన ఉదయం 11 గంటలకు రెండు దశాబ్దాల గుజరాత్ పట్టణ ప్రగతి పథం వేడుకలలో పాల్గొని, 'పట్టణాభివృద్ధి సంవత్సర ం–2025'ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలో ఆయన ప్రసంగిస్తారు.

దేశవ్యాప్తంగా అనుసంధానం పెంపు, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై తన నిబద్ధత మేరకు దాహోద్‌లో భారత రైల్వే ఇంజిన్ల తయారీ కర్మాగారాన్ని ప్రారంభిస్తారు. ఇక్కడ దేశీయ అవసరాల కోసమే కాకుండా ఎగుమతి నిమిత్తం కూడా 9,000 అశ్వికశక్తి సామర్థ్యంతో ఇంజిన్లను తయారు చేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇక్కడ తయారైన తొలి విద్యుత్ రైలింజన్‌ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. భారత రైల్వేల సరుకు రవాణా సామర్థ్యం పెంపులో ఈ రైలింజన్లు కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి పునరుత్పాదక బ్రేకింగ్ వ్యవస్థను అమరుస్తారు. పర్యావరణ సుస్థిరతకు దోహదం చేసే విధంగా ఈ వ్యవస్థలు విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తాయి.

ఈ కార్యక్రమానంతరం దాహోద్‌లో రూ.24,000 కోట్లకుపైగా విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. వీటిలో రైల్వేలకు సంబంధించినవి సహా గుజరాత్ ప్రభుత్వ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా వెరావల్–అహ్మదాబాద్ మార్గంలో వందే భారత్ ఎక్స్ ప్రెస్ సహా వల్సాద్–దాహోద్ మధ్య ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభిస్తారు. వీటితోపాటు గేజ్ మార్పిడి చేసిన కటోసాన్–కలోల్ సెక్షన్ మార్గాన్ని, దానిమీదుగా సరకు రవాణా రైలును కూడా ప్రారంభిస్తారు.

ప్రధానమంత్రి భుజ్‌లో రూ.53,400 కోట్లకుపైగా విలువైన వలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. విద్యుత్ రంగం సంబంధిత ప్రాజెక్టులలో ఖావ్డా పునరుత్పాదక ఇంధన పార్కులో ఉత్పత్తి చేయబడిన పునరుత్పాదక విద్యుత్తు ప్రసారం కోసం ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, నెట్‌వర్క్ విస్తరణ సహా తాపి వద్ద అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ తదితరాలున్నాయి. అలాగే కాండ్లా ఓడరేవు ప్రాజెక్టులు, గుజరాత్ ప్రభుత్వ బహుళ రహదారి, జల–సౌర విద్యుత్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 'పట్టణాభివృద్ధి సంవత్సరం–2005' పేరిట విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీ నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. ప్రణాళికబద్ధ మౌలిక సదుపాయాలు, మెరుగైన పాలన, పట్టణవాసుల జీవన నాణ్యత మెరుగుపరచడం ద్వారా గుజరాత్ రాష్ట్ర పట్టణ స్వరూపాన్ని ప్రగతికి ప్రతీకగా తీర్చిదిద్దడం దీని లక్ష్యం. దీనికి రెండు దశాబ్దాలు నిండిన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గాంధీనగర్‌లో ఏర్పాటు చేస్తున్న గుజరాత్ పట్టణాభివృద్ధి ప్రణాళిక–రాష్ట్ర క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అయిన 'పట్టణాభివృద్ధి సంవత్సరం–2025'ను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి, ఆరోగ్యం, నీటి సరఫరా సంబంధిత పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 22,000కుపైగా ఇళ్లను కూడా ఆయన దేశానికి అంకితం చేస్తారు. దీంతోపాటు 'స్వర్ణిమ్ జయంతి ముఖ్యమంత్రి షహేరీ వికాస్ యోజన' కింద గుజరాత్‌లోని పట్టణ స్థానిక సంస్థలకు రూ.3,300 కోట్ల నిధులను కూడా ఆయన విడుదల చేస్తారు.

సౌర విద్యుత్ హబ్‌గా ఎపి- చంద్రబాబు

అమరావతి, మే 26: సౌర విద్యుత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని, భారత్ సౌర తయారీ కేంద్రంగా రాష్ట్రం ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దేశం నిర్దేశించుకున్న హరిత లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా, స్థానికంగానే సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

కుప్పం పర్యటన ముగించుకుని నేడు బెంగుళూరు వెళ్తున్న సమయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనేది మన దేశపు సమున్నత లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని రకాల పరికరాలను దేశీయంగానే తయారుచేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి అమలుచేస్తోందని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని, దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు భారతదేశ సౌర విద్యుత్ తయారీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి మరింత మంది తయారీదారులను ఆకర్షించడం ద్వారా, భారతదేశ హరిత ఇంధన పరివర్తన ప్రక్రియలో మన రాష్ట్రం చురుకైన పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, ఈ పరిశ్రమల ద్వారా మన రాష్ట్ర ప్రజలకు లక్షలాదిగా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

తమిళనాడులో కూటమి తరుపున ఎన్నికల ప్రచారం చేస్తా - పవన్ కల్యాణ్

చెన్నై , మే 26: తమిళనాడులో త్వరలో జరిగే ఎన్నికలలో బిజెపి కూటమి విజయం సాధించడం తథ్యమని అన్నారు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ .

తమిళనాడు ఎన్నికల్లో అవసరమైతే ప్రచారం చేస్తానని అంటూ ఎన్డీయే కూటమి గెలుపు కోసం పని చేయడానికి తాను ఎన్నడూ సిద్ధమేనని తేల్చి చెప్పారు..

చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన వన్ నేషన్ – వన్ ఎలక్షన్ వర్క్ షాపులో

–ఈసారి ఎన్నికలలో అక్కడ బిజెపి కూటమిదే అధికారం
–జమిలీ ఎన్నికలకే తన మద్దతు
–ప్రతిసారి ఎన్నికలతో ప్రజా ధనం వృధా
–సిఎం స్టాలిన్ కూడా దీనిపై ఆలోచించాలి
–కొత్తగా పార్టీ పెట్టిన హీరో విజయ్ కు అభినందనలు
–వన్ నేషన్ – వన్ ఎలక్షన్ సదస్సులో పవన్ ఉద్ఘాటన

జనసేన సేనాని పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, జమిలిపై స్టాలిన్ తననిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు..తరచూ ఎన్నికల వల్ల కేంద్రంపై భారం పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.. సినిమాలువేరు,రాజకీయాలు వేరు అని అంటూ కొత్త పార్టీ పెట్టిన హీరో విజయ్‌కు శుభాకాంక్షతెలిపారు..

ఇక ఈవీఎంలపై వైసీపీకి ఓ విధానం లేదని పవన్ కల్యాణ్ మండిపడ్డారు.. 2019లో వైసీపీ గెలిచింది కూడా ఈవీఎంలతోనే అని గుర్తు చేశారు.

సనాతన ధర్మంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దేశమే సనాతన ధర్మ భూమి అని అంటూ మన దేశంలో రామాలయం లేని ఊరు లేదని చెప్పారు.

4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలతో విజయవంతంగా ముగిసిన రైజింగ్ నార్త్ ఈస్ట్ సదస్సు

న్యూఢిల్లీ, మే 26: ఈనెల 23-24 తేదీల్లో జరిగిన రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబడిదారుల సదస్సు 2025లో మొదటి రోజు ముఖ్యమైన పెట్టుబడి ప్రకటనల అనంతరం శనివారం (మే 24న) ముగిసింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈనెల 23న ఈ శిఖరాగ్ర సదస్సును ప్రారంభించారు. సదస్సు ముగింపు ప్రసంగంలో కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖా మంత్రి (ఎమ్‌డీఓఎన్‌ఈఆర్) శ్రీ జ్యోతిరాదిత్య ఎమ్. సింధియా మాట్లాడుతూ, ఈశాన్య ప్రాంతం ప్రపంచ భాగస్వామ్యం, పరస్పర ప్రయోజన కేంద్రంగా ఆవిర్భవించిందన్నారు. రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబడిదారుల సదస్సు 2025 అనూహ్యంగా రూ.4.3 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలను ఆకర్షించి, ఈశాన్య ప్రాంతాన్ని (ఎన్‌ఈఆర్) భారత తదుపరి ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చడం కోసం చక్కని వేదికను సిద్ధం చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు.

''జపాన్ నుంచి యూరప్, ఆసియాన్ వరకు 80కి పైగా దేశాల ప్రతినిధులను మేం స్వాగతించాం, అయితే ఇక్కడ "భారత భవిష్యత్తు ఈశాన్యంలోనే ఉంది" అనే ఐక్య భావనను ప్రదర్శించాం" అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

ఈశాన్య ప్రాంత విస్తార సామర్థ్యాన్ని గుర్తించడమే కాకుండా ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృషిని శ్రీ జ్యోతిరాదిత్య ఎమ్. సింధియా కొనియాడారు. "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ నిబద్ధత, ఈ ప్రాంతం పట్ల ఆయనకున్న సన్నిహిత, హృదయపూర్వక సంబంధం వల్లే ఇది సాధ్యమైంది. స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్దాల పాటు, ప్రభుత్వాలు ఈ భూమికి గల విస్తార సామర్థ్యాలను గుర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఒకప్పుడు భారత జీడీపీలో దాదాపు 20 శాతం సమకూర్చిన భూమి ఇది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా, ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు" అని శ్రీ సింధియా వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, మేం "మొత్తం ప్రభుత్వ విభాగాలన్నీ కలిసి సమన్వయంతో పనిచేసే" విధానాన్ని అవలంబించామని కేంద్ర మంత్రి తెలిపారు. వ్యవసాయం, క్రీడలు, పెట్టుబడులకు ప్రోత్సాహం, పర్యాటకం, ఆర్థిక కారిడార్లు, మౌలిక సదుపాయాలు, వస్త్రాలు, హస్తకళలు, పశుసంవర్ధక రంగాల్లో ఎనిమిది ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌లను మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిందనీ, ప్రతి రాష్ట్రం వారి సొంత రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవడానికి వీలు కల్పిస్తోందని ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ (డీఓఎన్‌ఈఆర్) మంత్రి వివరించారు.

ఈశాన్య రాష్ట్రాల్లో పెట్టుబడి అవకాశాలను అన్వేషించేలా ప్రోత్సహిస్తూ.. పెట్టుబడిదారులు, విదేశీ దౌత్యవేత్తలు, రాయబారుల వంటి వివిధ సంబంధిత వ్యక్తులతో డీఓఎన్ ఈఆర్ మంత్రిత్వ శాఖ చర్చలు నిర్వహిస్తోంది. గత ఏడాది కాలంలో, ఈ దిశగా దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా విస్తృత భాగస్వామ్యాల కోసం జరిగిన ప్రయత్నాలకు మంత్రిత్వ శాఖ నేతృత్వం వహించింది. ఈ కీలక కార్యక్రమాల్లో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో 9 రోడ్ షోలు, 95కి పైగా దేశాల ప్రతినిధులతో రాయబారుల సమావేశాలు, ఆరు రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రత్యేకించి ఈ రంగానికి సంబంధించిన పారిశ్రామిక చర్చలు ఆరు, అలాగే పీఎస్‌యూలు, పరిశ్రమ చాంబర్లు, కార్పొరేట్‌లతో అనేక సంప్రదింపులు నిర్వహించారు.

"ఈ చర్చల ఫలితంగా రూ.4.30 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి" అని శ్రీ జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

రైజింగ్ నార్త్ ఈస్ట్ సదస్సు 2025 గురించి మంత్రి వ్యాఖ్యానిస్తూ, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభం తర్వాత ఈ స్థాయిలో పెట్టుబడి సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి అన్నారు. శుక్రవారం, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ఈశాన్య ప్రాంతంలో అవకాశాలను అన్వేషించడానికి మొత్తం రూ. లక్షా యాభై-ఐదు వేల కోట్లకు పైగా పెట్టుబడులను ప్రకటించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ జ్యోతిరాదిత్య సింధియాతో పాటు, ఆ శాఖ సహాయంమంత్రి శ్రీ సుకాంత మజుందార్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి శ్రీ పబిత్రా మార్గరీటా, త్రిపుర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి శ్రీమతి సంతానా చక్మా పాల్గొన్నారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, సయుక్త కార్యదర్శి శ్రీ. అంగ్షుమాన్ డే, గణాంక సలహాదారు శ్రీ ధర్మవీర్ ఝా, ఇతర అధికారులు హాజరయ్యారు.

శుక్రవారం జరిగిన కార్యక్రమంలో, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ సేవలు, స్థానిక సంస్థల అభివృద్ధి లక్ష్యంగా రాబోయే ఐదేళ్లలో రూ. 75 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ముఖేశ్ అంబానీ హామీ ఇచ్చారు. అదానీ గ్రూప్ చైర్‌పర్సన్ గౌతమ్ అదానీ సైతం రానున్న దశాబ్ద కాలంలో రూ. 50 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ ఈశాన్య ప్రాంతంలో రూ. 30 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ప్రకటించారు.

"గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో గత దశాబ్దంలో ఈశాన్య ప్రాంతం సాధించిన అద్భుతమైన పరివర్తనను చూడటం నాకు అపారమైన గర్వం, ఆనందం కలిగిస్తోంది" అని విదేశాంగ శాఖ సహాయ మంత్రి శ్రీ పబిత్రా మార్గరీటా అన్నారు.

ప్రతి ఈశాన్య రాష్ట్రంలో పక్షం రోజులకోసారి కేంద్ర మంత్రులు పర్యటించాలన్న కేంద్ర మంత్రి శ్రీ సింధియా, ఇప్పటివరకు 700లకు పైగా పర్యటనలు జరిగాయన్నారు. ఇది మరింత చురుకైన, ఫలితాల ఆధారితమైన, ప్రజాకేంద్రితమైన మా పాలనా నమూనాను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

ఈశాన్య ప్రాంత శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసినందుకు శ్రీ సుకాంత మజుందార్ కృతజ్ఞతలు తెలిపారు. "గత రెండు రోజులుగా, భారత్ మండపం జాతీయ వేదికగా రూపాంతరం చెంది, ఈశాన్య ప్రాంత గళాన్ని, దార్శనికతను, విస్తారమైన సామర్థ్యాన్ని ఘనంగా ప్రదర్శించింది" అని పేర్కొన్నారు.

"గువాహటి నుంచి ముంబయి వరకు, హైదరాబాద్ నుంచి కోల్‌కతా వరకు, తొమ్మిది పెట్టుబడిదారుల రోడ్ షోలు, రెండు రాయబారుల స్థాయి సమావేశాలు, 131 మందికి పైగా పెట్టుబడిదారులు, 24 మంది పరిశ్రమ ప్రముఖుల భాగస్వామ్యంతో ఈశాన్య ప్రాంత అభివృద్ధి ప్రయాణానికి సరికొత్త ఊపు లభించింది" అని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఈశాన్య ప్రాంతంలో జరిగిన పురోగతిని వివరిస్తూ, "2014లో 10,905 కిలోమీటర్లుగా ఉన్న ఈ ప్రాంతంలోని జాతీయ రహదారులు 2024 నాటికి 16,207 కిలోమీటర్లకు పెరిగాయి. మొత్తం 694.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, 10 వేల సర్క్యూట్ కిలోమీటర్లకు పైగా ప్రసార, పంపిణీ మార్గాలు అదనంగా తోడయ్యాయి. ముప్పై ఆరు ప్రధాన విమానయాన ప్రాజెక్టులు పూర్తయ్యాయి, 2014 – 2024 మధ్య విమానాశ్రయాల సంఖ్య 9 నుంచి 17కి పెరిగి దాదాపుగా రెట్టింపయ్యాయి." అని తెలిపారు.

ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతి సౌందర్యానికి మాత్రమే కాకుండా సహజ వనరులు, పర్యాటకం, క్రీడలు, సంగీత రంగాల్లో కూడా అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ఈశాన్య ప్రాంత మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్ అన్నారు. "ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే, భవిష్యత్తు ఈశాన్య రాష్ట్రాలదే అని చెప్పవచ్చు. ఎన్ ఈ ఆర్‌లో పెట్టుబడులను ప్రోత్సహించడానికి మేం ఎనిమిది రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో రోడ్ షోలు, రాయబారి స్థాయి రౌండ్ టేబుల్, రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించాం" అని శ్రీ చంచల్ కుమార్ వివరించారు. గత నెలలో నిర్వహించిన రాయబారుల సమావేశంలో దాదాపు 76 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని, మంత్రిత్వ శాఖకు రూ. 4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలు అందాయని ఆయన తెలిపారు.

ఈశాన్య ప్రాంతంలో పెట్టుబడికి ఆసక్తి చూపిన పెట్టుబడిదారులకు ఈశాన్య ప్రాంత మంత్రిత్వ శాఖ గణాంక సలహాదారు శ్రీ ధర్మవీర్ ఝా కృతజ్ఞతలు తెలిపారు, "ఈ రోజు, రైజింగ్ నార్త్ ఈస్ట్ సదస్సు రూపంలో మనం చేసిన కృషికి మంచి ముగింపు లభించింది" అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ. 4.30 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని శ్రీ ధర్మవీర్ ఝా తెలిపారు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ మార్గదర్శకమైన పెట్టుబడి సదస్సులో మంత్రుల సమావేశాలు, వ్యాపార-ప్రభుత్వ సమావేశాలు, వ్యాపార-వ్యాపార సమావేశాలు, అంకురసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు పెట్టుబడులను ప్రోత్సాహించడం కోసం అనుసరిస్తున్న విధానాలు, సంబంధిత చొరవలను ప్రదర్శించాయి. ఈ శిఖరాగ్ర సదస్సుకు ముందు నిర్వహించిన వరుస రోడ్ షోలు, రాష్ట్రాల రౌండ్ టేబుల్ సమావేశాలు అలాగే ఈశాన్య ప్రాంత రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన రాయబారుల సమావేశం, ద్వైపాక్షిక చాంబర్ల సమావేశం వంటి సన్నాహక కార్యక్రమాలన్నీ విజయవంతంగా ముగిశాయి.

శుక్రవారం జరిగిన ఈ శిఖరాగ్ర సమావేశ ప్రారంభోత్సవ సందర్భంగా ప్రసంగించిన ప్రధానమంత్రి, గత దశాబ్ద కాలంలో ఈశాన్య ప్రాంత విద్యా రంగంలో రూ.21 వేల కోట్లు పెట్టుబడి పెట్టిన విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.

ఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతన ఎన్డీయే ముఖ్యమంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, మే 26:ఢిల్లీలో ఈరోజు జరిగిన ఎన్డీయే ముఖ్యమంత్రుల సమావేశానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ప్రయోజనాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని ప్రధానమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

"ఢిల్లీలో జరిగిన ఎన్డీయే ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొన్నాను. వివిధ అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలనా వ్యవస్థల బలోపేతం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు తదితర రంగాల్లో వివిధ రాష్ట్రాలు తమ ఉత్తమ అనుభవాలను పంచుకున్నాయి. రాష్ట్రాల అనుభవాలను వినడం ఎంతో చక్కగా అనిపించింది. మన అభివృద్ధి ప్రయాణాలకు మరింత వేగం ఇవ్వాల్సిన అవసరాన్ని నేను స్పష్టం చేశాను. డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ప్రయోజనాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాల్సిన అవసరాన్ని పేర్కొన్నాను. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, యువశక్తి సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన సమన్వయం అవసరాన్ని వివరించాను" అని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో వరస పోస్టుల్లో పేర్కొన్నారు.

సాయం పొందుతున్నా ఎందుకీ అహంకారం

-సినీ పెద్దలను నిలదీసిన మంత్రి కందుల

అమరావతి, మే 26:సినీ పరిశ్రమ పెద్దలు వ్యవహరిస్తున్న తీరుపై లేటెస్ట్‌గా మంత్రి కందుల దుర్గేష్ అసహనం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు ఎంతో సహకరిస్తోందని తెలిపారు. కానీ, కొందరి మాటలు అహంభావ పూరితంగా ఉన్నాయని, ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్ల ధరలు పెంచమని వస్తున్నారని.. అందుకు మేం ఓకే చేస్తున్నాం. ఆ వెంటనే ఎవరో ఒకరు కోర్టుల్లోపిల్ వేస్తున్నారని తన అభిప్రాయం వ్యక్తం చేశారు.విజయవాడలో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి నిర్ణయాల వల్ల ఆయా అధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. అయినా మేం సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం రేట్లు పెంపునకు అనుమతిస్తున్నాం అని మంత్రి కందుల దుర్గేష్ వివరణ ఇచ్చారు. ఒక సినిమా నిర్మాణం వెనుక చాలామంది కృషి ఉంటుంది. అలాంటి సినిమా మీద వందలాది కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. ఇలా సడెన్ గా ఎవరితో చర్చించకుండా థియేటర్స్ బంద్ పెట్టాలనే నిర్ణయాలు తీసుకోవడం తగదని హెచ్చరించారు.

హరిహర వీరమల్లు విడుదల సమయంలోనే ఈ థియేటర్ల బందు అనే విషయం.. ఎందుకు బయటకు వచ్చిందని ప్రశ్నించారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక గ్రూపులా ఏర్పడి, ఎవరితో చర్చించి థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చారో తెలుసుకోవాలని హోంశాఖ కార్యదర్శిని విచారణ చేయమని కోరానని వెల్లడించారు.

ఇప్పటికైనా సినిమా ఇండస్ట్రీకి చెందిన పెద్దలు ముఖ్యమంత్రిని కలసి వారి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా తాను ఫిలిం ఛాంబర్ కు లేఖ కూడా రాశాను. సినిమా రంగానికి సంబంధించి ప్రత్యేక పాలసీని రూపొందించాలని చూస్తున్నామని లేఖలో వివరంగా రాసానని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వం మాదిరిగా మా ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవని.. కొంతమంది అహంకార ధోరణి తో మాట్లాడటం మానేసి అధికారులతో చర్చలు జరపాలని మంత్రి కోరారు. ఇటీవలే ఓ మాజీ మంత్రి సినిమా విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధిగా అలా మాట్లాడటం చాలా తప్పు అని మంత్రి కందుల అన్నారు.

తాగుబోతుల వివాదంలో మధ్యవర్తి బలి

హైదరాబాద్, మే 26:ఉప్పల్‌లో తాగుబోతులు వీరంగం సృష్టించారు. మద్యం మోతాదుకు మించి తాగారో ఏమో తెలియదు కాని ఇద్దరు వ్యక్తులు కొట్టుకుంటుండగా మరో వ్యక్తి (పవన్ కుమార్) నచ్చచెప్పేందుకు వెళ్లాడు. ఇక అంతే అందులో ఒకరు మధ్యవర్తిగా వచ్చిన పవన్ కుమార్‌ను హత్య చేశారుడు. ఈ ఘటన రామంతాపూర్ గుడ్ డే బార్ లో చోటు చేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్ లోని గుడ్ డే బార్ లో ఆదివారం (మే 25) రాత్రి పవన్ కుమార్(25) అ నే వ్యక్తిని శ్రవణ్ అనే వ్యక్తి బీర్ బాటిల్ తో పొడవడంతో పవన్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రవణ్.. అతని మిత్రుడు హరి మధ్య ఘర్షణ జరుగుతుండగా గొడవను ఆపేందుకు పవన్ కుమార్‌వెళ్లాడు. దీంతో చేతిలో ఉన్న బీరు సీసాతో పవన్‌ను పొడవడంతో అక్కడికక్కడే మరణించాడు.

సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పవన్‌కుమార్.. హరి.. శ్రవణ్ ముగ్గురూ పరిచయస్తులే. వీరిని అంబర్ పేట.. పటేల్ నగర్ వాసులుగా పోలీసులు గుర్తించారు.ఆదివారం రాత్రి పబ్‌లో పార్టీ జరిగింది. తెల్లవారేసరికి యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. హర్షవర్ధన్ అనే వ్యక్తి సికింద్రాబాద్ లోని ఓ ఏసీ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్నేహితులు, తోటి ఉద్యోగులతో కలిసి కొండాపూర్ క్వాక్ పబ్‌లో ఆదివారం రాత్రి పార్టీ చేసుకున్నాడు. పబ్ నుంచి గచ్చిబౌలి లోని అపార్టుమెంట్‌కు హర్షవర్ధన్, అతని స్నేహితులు వచ్చారు. అపార్టుమెంట్‌లో మరోసారి అందరూ మద్యం సేవించారు.

ఆయుష్ విధానం శాస్త్రీయ పద్ధతిలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందికి చేరువయ్యేలా ఈ ఒప్పందం సహకరిస్తుంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 26:సంప్రదాయ వైద్య విధానాలను అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మధ్య 2025, మే 24న చరిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ హెల్త్ ఇంటర్వెన్షన్స్ (ఐసీహెచ్ఐ) కింద ఒక ప్రత్యేక సంప్రదాయ వైద్య విధాన ఆరంభాన్ని ఈ ఒప్పందం సూచిస్తుంది.

మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో ఈ ఒప్పందం ప్రాధాన్యం గురించి ప్రధానమంత్రి వివరించారు. "ఆయుర్వేద రంగంలో జరిగిన ఒక విషయాన్ని గురించి తెలుసుకుంటే మీరు చాలా సంతోషిస్తారు. నిన్ననే అంటే మే 24న డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్, నా మిత్రుడు తులసి భాయ్ సమక్షంలో ఒక ఒప్పంద పత్రంపై సంతకాలు అయ్యాయి. ఈ ఒప్పందంతో అంతర్జాతీయ ఆరోగ్య వర్గీకరణ కింద ఒక ప్రత్యేక సంప్రదాయ వైద్య మాడ్యూల్‌పై పని ప్రారంభమైంది. ఈ చొరవతో ఆయుష్‌ను ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ పద్ధతిలో ఎక్కువ మందికి చేర్చడానికి సహకారం లభిస్తుంది" అని అన్నారు.

డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్ (ఐసీడీ-11)ను ఐసీహెచ్ఐ బలపరుస్తుంది. అలాగే చికిత్స కోసం వినియోగిస్తున్న విధానాలు, ఆరోగ్య పద్ధతులను డాక్యుమెంట్ చేస్తుంది. సంప్రదాయ వైద్య విధానాన్ని కూడా వీటిలో చేర్చడంతో ఆయుర్వేద, యోగ, సిద్ధ, యునాని విధానాలకు సంబంధించిన థెరపీలు ? పంచకర్మ, యోగ థెరపీ, యునాని విధానాలు, సిద్ధ పద్ధతులు ఇప్పుడు అంతర్జాతీయంగా ప్రామాణీకరించిన పద్ధతుల్లో గుర్తింపు పొందుతాయి.

ఘనమైన సాంప్రదాయ విజ్ఞాన వారసత్వాన్ని అంతర్జాతీయంగా ప్రధాన ఆరోగ్య సేవల వ్యవస్థలోకి తీసుకురావాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ఒప్పందం ఉంది. అలాగే దీనికి శాస్త్రీయ వర్గీకరణ, అంతర్జాతీయ ప్రమాణాల మద్దతు ఉంది.

ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డా.టెడ్రోస్ అధానం గీబ్రయేజస్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు:

''సంప్రదాయ వైద్యం, అంతర్జాతీయంగా ఆరోగ్య విధానాల వర్గీకరణకు సంబంధించి భారత ఏఎన్ఐంఎబీబష్ట సెక్రటరీ వైద్య రాజేశ్ కొటెచా ఏచిఉఊ 3 మిలియన్ డాలర్ల ఒప్పందంపై సంతకం చేయడం ఆనందంగా ఉంది. చ ఊ వ జీ శ్రీ బి ష్ట ఈ నీ తీ ం శ్రీ శ్రీ అందించాలనే నిబద్ధతను మేం స్వాగతిస్తున్నాం.''

ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో సమగ్రమైన, సాక్ష్యం ఆధారితమైన, విధానపరంగా గుర్తింపు పొందిన వైద్య విధానంగా ఆయుష్ మారేలా ఐసీడీ-11 వ్యాధులు, వైద్య విధానాలపై ఐసీహెచ్ఐ కొత్త మాడ్యూల్ ప్రభావం చూపిస్తాయి.

ఇది కోడింగ్ అప్డేట్ కంటే ఎక్కువ. ఇది భారతీయ సంప్రదాయ వైద్య వ్యవస్థల ద్వారా సరసమైన, అందరికీ అందుబాటులో ఉండే, నమ్మకమైన ఆరోగ్య సేవలను అందించే దిశగా వేసిన పరివర్తనాత్మకమైన అడుగు.

ఓడలోని హానికర రసాయనాలపై ఆందోళన

న్యూఢిల్లీ, మే 26:లైబీరియాకు చెందిన కంటైనర్ నౌక – ఎంఎస్సీ ఈఎల్ఎన్ఏ 3 (ఐఎంఓ నెం.9123221) 2025 మే 25న ఉదయం 7.50 గంటలకు కొచ్చి తీరంలో మునిగిపోయింది. నౌక లోని 24 మంది సిబ్బందిని భారత తీర గస్తీ దళం (ఐసీజీ) , మరో ముగ్గురిని భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సుజాత రక్షించాయి. ఈ నౌకలో 640 కంటైనర్లు ఉండగా, వాటిలో 13 కంటైనర్లలో హానికరమైన పదార్థాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నాయి. అంతేకాక, నౌకలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నెస్ ఆయిల్ కూడా ఉన్నాయి. ఇవన్నీ నౌకతో పాటు సముద్రంలో మునిగిపోయాయి.

కేరళ తీర ప్రాంతంలో ఉన్న సున్నితమైన సముద్ర జీవవైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భారత తీర గస్తీ దళం పూర్తిస్థాయి కాలుష్య నివారణ చర

ఢిల్లీలో ఫిట్ ఇండియా 'సండేస్ ఆన్ సైకిల్'లో మీడియా సోదరులతో కలిసి సైకిల్ తొక్కిన కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మే 26:న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జర్నలిస్టులు, మీడియా సోదరులు ముఖ్య అతిథులుగా ఈరోజు నిర్వహించిన ఉత్సాహభరితమైన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ 300 మందికి పైగా ఫిట్‌నెస్ ఔత్సాహికులతో కలిసి సైకిల్ తొక్కి వారిలో ఉత్సాహం నింపారు.

ఢిల్లీ జర్నలిస్ట్ అసోసియేషన్, ఢిల్లీ స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్, అథ్లెట్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో నాలుగు కిలోమీటర్లు అందరూ సైక్లింగ్ చేశారు. దీనిలో పాల్గొన్న మీడియా రంగ నిపుణులు, ఈ అనుభవాన్ని "మేల్కొలుపు" గా అభివర్ణించారు.

"వర్షం ఉన్నప్పటికీ సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం నాకు సంతోషం కలిగించింది. మా జర్నలిస్టు మిత్రులు పూర్తి ఉత్సాహంతో దీనిలో పాలుపంచుకోవడం నిజమైన ఆనందాన్ని ఇచ్చింది. జర్నలిస్టులకు ప్రశాంతమైన దినచర్య లభించడం చాలా అరుదు. సాధారణంగా వారు పగలూ, రాత్రీ తేడా లేకుండా పని చేస్తారు. మనం ప్రతి ఉదయం చదివే ముఖ్యాంశాలు రాత్రంతా వారి అవిశ్రాంత ప్రయత్నం ఫలితమే. వారు ఈ ముఖ్యమైన పనిని విజయవంతంగా కొనసాగించడానికి, వారు ఫిట్‌గా ఉండటం చాలా అవసరం. అందుకే వారి పట్ల కృతజ్ఞతను చూపించడానికి, అలాగే ఫిట్‌నెస్ కోసం సైక్లింగ్ లేదా ఏదైనా కసరత్తు అవసరమనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ సున్నితంగా గుర్తు చేయడానికే ఈరోజు వీరందరినీ ఆహ్వానించాం" అని డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

''ఈరోజు నాకు ఇక్కడ అద్భుతమైన అనుభవం లభించింది. ఫిట్ ఇండియా మూవ్‌మెంట్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చొరవతో ప్రారంభించిన సండేస్ ఆన్ సైకిల్.. ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేందుకు ఒక అద్భుతమైన మార్గం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఆరోగ్యకరమైన జీవితానికి కీలకం అని నేను ఎప్పుడూ నమ్ముతాను. ఫిట్‌గా ఉండటానికి ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం అరగంట పాటు నడవాలి.. అయితే సైక్లింగ్ కూడా అంతే ప్రయోజనకరం అని నేను భావిస్తున్నాను! జంక్ ఫుడ్ మానుకోండి, ఒకే చోట నిశ్చలంగా ఉండకుండా అటూ ఇటూ నడవండి, ఫిట్‌గా ఉండండి" అని ఈ కార్యక్రమానికి జర్నలిస్టులతో పాటు అతిథిగా విచ్చేసిన, తైక్వాండో ఆసియా ఛాంపియన్‌షిప్ పతక విజేత శ్రీమతి రోడాలి బారువా అన్నారు.

ఢిల్లీ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ రాకేష్ థాప్లియాల్ తన కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, "కేంద్ర మంత్రి మమ్మల్ని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం అద్భుతమైన అనుభవం. వర్షం కురుస్తున్నా, మా పనిలో భాగంగా అర్ధరాత్రి వరకు పనిచేయాల్సి ఉన్నా, చాలా మంది జర్నలిస్టులు ఇక్కడకు వచ్చారు. ఫిట్‌నెస్ సరదాగా ఉంటుందనే విషయాన్ని ఇది రుజువు చేస్తుంది. సైక్లింగ్ వంటి కేవలం ఒక గంట కార్యాచరణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అలాగే వైద్యం కోసం చేయాల్సిన ఖర్చులను తగ్గించడంలో చాలా సహాయపడుతుంది" అని అన్నారు.

ఢిల్లీ స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ అభిషేక్ త్రిపాఠి మాట్లాడుతూ... "సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయతో కలిసి పాల్గొనడం వాస్తవిక ప్రపంచంలోని విషయాల ప్రాధాన్యాలను గుర్తుచేసింది. కేవలం 3-4 కిలోమీటర్లు మాత్రమే సైకిల్ తొక్కినా.. మనలో చాలా మందికి ఊపిరి ఆడనంత ఇబ్బందిగా అనిపించింది! ముఖ్యంగా ఎల్లప్పుడూ ప్రయాణంలో ఉండే మీడియా రంగంలో పనిచేస్తున్న వారి కోసం ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో ఇది మనకు గుర్తు చేసింది. సైక్లింగ్ మన ఆరోగ్యానికి మాత్రమే కాదు, పర్యావరణం కోసం కూడా చాలా ముఖ్యమైనది" అని అన్నారు.

ఢిల్లీ మీడియా దృష్టి నుంచి అగర్తలా రాజ వీధుల వరకు, ఈ పెడల్ ఆధారిత ఉద్యమం దేశమంతటా వివిధ ప్రదేశాల్లో ప్రతిధ్వనించింది. వందలాది మంది ఔత్సాహికులను ఒకచోట చేర్చింది.

త్రిపుర గవర్నర్ ముఖ్య అతిథిగా ఉజ్జయంత ప్యాలెస్ నుంచి 120 మందికి పైగా సైక్లిస్టులు ర్యాలీ నిర్వహించారు. మంత్రి శ్రీ టింకూ రాయ్, యువజన వ్యవహారాలు-క్రీడల శాఖ డైరెక్టర్ శ్రీ ఎస్.బి. నాథ్, సాయ్ ప్రాంతీయ డైరెక్టర్ వంటి సీనియర్ అధికారులు ఆరోగ్యకరమైన, ఐక్య త్రిపురకు ప్రతీక అయిన ఈ కమ్యూనిటీ రైడ్‌లో పాలుపంచుకున్నారు. "ఈ ఉద్యమంలో భాగం కావడం మాకు దక్కిన గౌరవం" అని తన అగర్తలా సైక్లోహాలిక్స్ ఫౌండేషన్‌తో కలిసి ఈ రైడ్‌కు నాయకత్వం వహించిన సైకిల్ మేయర్ శ్రీ గోపేశ్ దేబ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

బెంగళూరులోని సాయ్ ఎన్‌టీసీ వద్ద, మీడియా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ అరుణ్ శర్మ, శ్రీమతి అమితా శర్మలతో పాటు 70 మంది మీడియా సిబ్బంది సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్నారు.

చక్రాలను తిప్పడం, సరదాగా సంభాషణలు సాగించడంతోనే, సమాచారాత్మక, ప్రేరేపిత మీడియాతో ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఈ రైడ్ చాటి చెప్పింది.

సాయ్ ఎన్‌టీసీ నుంచి బోడోలాండ్ సచివాలయం వరకు ఆరు కిలోమీటర్ల కోక్రాఝార్ ఎడిషన్ సుందరమైన ప్రాంతాలను కవర్ చేస్తూ సాగింది. దీనిని ప్రెస్ క్లబ్ కోక్రాఝార్‌కు చెందిన శ్రీ ప్రీతమ్ బ్రహ్మ చౌదరి, శ్రీ సూరజ్ బసుమత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మాజీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీమతి బిబారి బ్రహ్మ పెడల్ శక్తికి క్రీడా ప్రతిష్ఠను జోడించారు.

వోన్తరు సంఖ్యలో జనం హాజరైనప్పటికీ, ఎస్‌టీసీ రాయ్‌పూర్ కార్యక్రమంలో మీడియా అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి శ్రీ పి.కె. రావు, భారతీయ రాష్ట్రీయ పత్రికా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మనోహర్ సింగ్ వంటి మీడియా రంగ ప్రముఖులతో పాటు 35 మంది ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డిసెంబర్ 2024లో ప్రారంభమైన ఈ సైక్లింగ్ కార్యక్రమం ఇప్పుడు 5,500 లకు పైగా ప్రదేశాలకు విస్తరించి మూడు లక్షలకు పైగా ప్రజలకు చేరువైంది. శ్రీమతి సానియా మిర్జా, శ్రీ మిలింద్ సోమన్, శ్రీ ఇమ్రాన్ హష్మి, శ్రీ జాన్ అబ్రహం, శ్రీ ఇంతియాజ్ అలీ, శ్రీ శంకర్ మహదేవన్, శ్రీ దారా సింగ్ వంటి దిగ్గజాల మద్దతుతో సోషల్ మీడియా హోరెత్తింది. వీరంతా ఫిట్‌నెస్ కోసం ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరని చెప్పారు.

విధాన నిర్ణేతలు, అథ్లెట్లు, పౌర సమాజం నుంచి పెరుగుతున్న మద్దతుతో, సండేస్ ఆన్ సైకిల్.. నగరాలను సైక్లింగ్ కారిడార్‌లుగా, పౌరులను ఆరోగ్య రాయబారులుగా మారుస్తూ వారి హృదయాలలోకి, వార్తల ముఖ్యాంశాల్లోకి ప్రవేశిస్తూనే ఉంది. వర్షం కురుస్తున్నా.. ఎంత ఎక్కువ ఎండగా ఉన్నా.. ఫిట్‌నెస్ ఎప్పుడూ వాతావరణం కోసం వేచి ఉండదు అని ఇలాంటి కార్యక్రమాలు చాటుతూనే ఉన్నాయి.

పవన్ కు ఎదురెళ్లినా , ఆయన ఎదురొచ్చినా మనకే నష్టం -అల్లు అరవింద్

హైదరాబాద్, మే 26: టాలీవుడ్ లో థియేటర్ల మూసివేతపై పెద్ద రగడ సాగుతోంది. తనకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారంటూ పవన్ కల్యాణ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఓ నలుగురు నిర్మాతలు కలిసి పవన్ సినిమాను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ క్రమంలోనే అల్లు అరవింద్ సంచలన ప్రెస్ మీట్ నిర్వహించారు. కొన్ని రోజులుగా వినిపిస్తున్న అనేక రూమర్లపై ఆయన తాజాగా స్పందించారు. 'కొన్ని రోజులుగా ఆ నలుగురు.. ఆ నలుగురు అంటున్నారు. నేను ఆ నలుగురిలో లేను. ఆ నలుగురి వ్యాపారంలోనేను లేను. ఆ నలుగురు తర్వాత పది మంది అయ్యారు. కొవిడ్ టైమ్ లోనే నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఒక్క థియేటర్ కూడా లేదు. తెలంగాణలో నాకు ఉన్నది త్రిబుల్ ఏ మాత్రమే. తెలంగాణలో నా దగ్గర ఒక్కటి లీజుకు లేదు.

ఏపీలో కొన్ని మాత్రమే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మొత్తంగా కలిపి 15లోపు థియేటర్లు మాత్రమే ఉన్నాయి. పాత అలవాటు కొద్ది నన్ను ఆ నలుగురిలో నన్ను కలిపేస్తున్నారు. ఆ నలుగురిలో నన్ను కలపకండి.

1500 థియేటర్లకు నా వద్ద 15 మాత్రమే ఉన్నాయి. ఈ థియేటర్ల మూసివేత విషయంపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ నిర్ణయం సమంజసమైందే. ఈ థియేటర్లకు సంబంధించిన మీటింగ్ కు నేను వెళ్లలేదు. నాకు ఇష్టం లేదు. మా గీతా ఫిలిమ్స్ ప్రొడ్యూసర్లను కూడా వెళ్లొద్దని చెప్పాను

.థియేటర్లకు కష్టాలు ఉన్నాయి. వాటిని ఛాంబర్, గిల్డ్ తో డిస్కషన్ చేసుకుంటే బాగుండేది. కుదరకపోతే ప్రభుత్వం వద్దకు అయినా వెళ్లాల్సి ఉండేది. కానీ అవేవీ చేయకుండానే మూసేస్తామని ఏకపక్షంగా చెప్పారు. అందుకే నాకు చిరాకు కలిగి నేను వెళ్లలేదు.పవన్ కల్యాణ్ సినిమా రిలీజ్ అవుతుండగా మూసేయడం దుస్సాహసమే. దానికి ముందడుగు వేయకూడదు. పవన్ కు ఎదురెళ్ల కూడదు. ఇండస్ట్రీ నుంచి ఏం అడిగినా పవన్ కల్యాణ్ హెల్ప్ చేస్తున్నారు. మేం నిర్మాతలుమొదట్లో పవన్ వద్దకు వెళ్లినప్పుడు చంద్రబాబు గారిని మర్యాదపూర్వకంగా కలవండి అని చెప్పారు. కానీ ఎవరూ వెళ్లలేదు. నేను అడిగినా సరే నిర్మాతలు వెళ్లి కలవలేదు.ప్రభుత్వంతో మాకేంటి సంబంధం అని కొందరు నిర్మాతలు అంటున్నారు. అలా అవసరమే లేనప్పుడు అంత పెద్ద పెద్ద వాళ్లు వెళ్లి గత సీఎంను ఎందుకు కలిశారు. మరి ఇప్పుడు ఎందుకు కలవట్లేదు.

ఒక ప్రభుత్వం వచ్చిన తర్వాత మన బాధ్యతగా వెళ్లి కలవాలి. వాళ్లు మనకోసం అన్నీ రకాలుగా హెల్ప్ చేస్తున్నారు. కానీ నిర్మాతలు మాత్రం ఎవరికి వారు వెళ్లి కలుస్తూ పనులు చేసుకుంటున్నారు. ఎగ్జిబిటర్లకు నిజంగానే సమస్యలు ఉన్నాయి. కాదనట్లేదు.కానీ వారు ముందుగా ఛాంబర్, గిల్డ్ లో డిస్కషన్ చేసినా సరే సమస్యలు పరిష్కారం కాకపోతే.. అప్పుడు ప్రభుత్వం వద్దకు వెళ్లాల్సింది.

అంతే గానీ ఏకపక్షంగా థియేటర్లు మూసేస్తామని చెప్పారు. ఇండస్ట్రీకి ఎంతో చేస్తున్న పవన్ కల్యాణ్ గారి సినిమా ఉండగా.. ఇలా మూసేస్తామని చెప్పడం కరెక్ట్ కాదు. అది పవన్ కల్యాణ్ ను బెదిరించడమే అవుతుంది. పవన్ కల్యాణ్ బాధపడటం కరెక్ట్ . వాళ్ల నిర్ణయం నాకు నచ్చలేదు కాబట్టే వెళ్లలేదు. ఈ విషయాల్లోకి నన్ను లాగకండి. నాపై వార్తలు రాయకండి' అంటూ చెప్పుకొచ్చారు అల్లు అరవింద్.

యువకులు క్రీడల్లో రాణించాలి: నవతరం యూత్ అధ్యక్షుడు

హైదరాబాద్, మే 26:: క్రీడల్లో రాణించిన యువకులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నవతరం యూత్ అధ్యక్షుడు రాజశేఖర్ గుప్తా తెలిపారు. నవతరం ప్రీమియర్ లీగ్ సీజన్ 5ని కందుకూరు మండల కేంద్రంలో గల వైఎన్ఆర్ మినీస్టేడియంలో నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి నగదుతో పాటు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కింద ధోనీ టీమ్ (శివగౌడ్)కు సొడపు శేఖర్ గౌడ్ రూ.30 వేలు, రెండో బహుమతి కింద తాళ్ల అభిల్ సోను టీమ్‌కు ఢిల్లీ కృష్ణ ముదిరాజ్ రూ.17 వేలను అందజేశారు. విజేతలు, రన్నరప్‌లకు నిర్వాహకులు షీల్డ్, మెడల్స్ అందజేశారు.

ఈ సందర్భంగా నిర్వాహకులుమాట్లాడుతూ.. నవతరం యూత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించి యువకుల్లో ఉత్సాహం నింపుతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మండల కేంద్రంలో నవతరం యూత్ ఆధ్వర్యంలో మరిన్ని స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు.

మోసపూరిత నమూనాలపై భాగస్వామ్య సంస్థలతో కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి సమావేశం

న్యూఢిల్లీ, మే 26:మోసపూరిత నమూనాల (డార్క్ ప్యాటర్న్)కు సంబంధించి వినియోగదారుల ఆందోళనలపై మే 28న న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఉన్నత స్థాయి భాగస్వామ్య సమావేశంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ - కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ప్రసంగిస్తారు. సమస్య పరిష్కారం కోసం మరింత ప్రభావవంతమైన మార్గాలపైనా ఈ సమావేశంలో చర్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆహారం, ప్రయాణం, సౌందర్య సాధనాలు, ఔషధాలు, రిటైల్, దుస్తులు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సేవలందిస్తున్న అన్ని ప్రధాన ఇ-కామర్స్ వేదికలు ఈ సమావేశంలో పాల్గొంటాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, 1ఎంజీ.కామ్, యాపిల్, బిగ్‌బాస్కెట్, మీషో, మెటా, మేక్ మై ట్రిప్, పేటీఎం, ఓలా, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, స్విగ్గీ, జొమాటో, యాత్ర, ఉబర్, టాటా, ఈజ్ మై ట్రిప్, క్లియర్ ట్రిప్, ఇండియామార్ట్, ఇండిగో ఎయిర్లైన్స్, జిగో, జస్ట్ డయల్, మెడికా బజార్, నెట్‌మెడ్స్, ఓఎన్డీసీ, థామస్ కుక్, వాట్సాప్ వంటి ముఖ్య సంస్థలు ఇందులో సమావేశంలో పాల్గొంటాయి. వినియోగదారుల హక్కులను ముందుకు తీసుకెళ్లడంతోపాటు పారదర్శకమైన, విశ్వసనీయమైన మార్కెటును తీర్చిదిద్దడంలో పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని వినియోగదారుల వ్యవహారాల శాఖ భావిస్తోందనడానికి ఈ సమావేశ భాగస్వాముల జాబితా నిదర్శనం.

కీలక పారిశ్రామిక సంస్థల తోపాటు స్వచ్ఛంద వినియోగదారుల సంస్థలు (వీసీవోలు), ప్రముఖ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు (ఎన్ఎల్యూ) కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నాయి. వారి ఆలోచనలు, పరిశోధన, నియంత్రణ దృక్పథాలు బలమైన, ఆచరణయోగ్యమైన పరిష్కారాలను అందించడంలో విలువైన మార్గాలను అందిస్తాయి.

వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, న్యాయబద్ధమైన వాణిజ్య విధానాలను ప్రోత్సహించడంలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ పరిధిలోని వినియోగదారుల వ్యవహారాల విభాగం అచంచలమైన నిబద్ధతతో పనిచేస్తోంది. మోసపూరిత నమూనాల (వినియోగదారులను తప్పుదోవ పట్టించడం, లేదా వారికి కొనే ఉద్దేశం లేని వస్తువులను కొనేలా న్యాయవిరుద్ధంగా ప్రేరేపించే మోసపూరిత యూజర్ ఇంటర్‌ఫేస్ నమూనా)తో న్యాయవిరుద్ధమైన వాణిజ్య పద్ధతులను అరికట్టే దిశగా ఈ విభాగం క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి చర్యలు వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. న్యాయబద్ధమైన మార్కెట్ గతిని దారి మళ్లిస్తాయి, డిజిటల్ వాణిజ్య సమగ్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తాయి.

మోసపూరిత నమూనాలను అరికట్టేందుకు ఈ విభాగం అనేక చర్యలు తీసుకుంది. భాగస్వాములందరినీ విస్తృతంగా సంప్రదించిన అనంతరం 2023 నవంబర్ 30న ఈ విభాగం మోసపూరిత నమూనాలను నివారించేందుకు సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ద్వారా ఇ-కామర్స్‌లో 13 ముఖ్యమైన మోసపూరిత నమూనాలను గుర్తించింది. కొనాలని హడావుడి చేసేలా తప్పుడు ప్రకటనలు, వినియోగదారుడికి తెలియకుండా వస్తువుల జాబితాలో ఇతర వసూళ్లను జోడించడం (బాస్కెట్ స్నీకింగ్), న్యూనతను కలిగించే మాటలు (కన్ఫమ్ షేమింగ్), బలవంతపెట్టే చర్యలు, అయిష్టంగానైనా వినియోగదారుడి సభ్యత్వాన్ని కొనసాగించే వ్యూహాలు (సబ్‌స్క్రిప్షన్ ట్రాప్), ఇంటర్‌ఫేస్ ద్వారా వినియోగదారులను ప్రేరేపించడం, తక్కువ ధరలంటూ ప్రచారంతో ఆకట్టుకుని తీరా ఎక్కువ ధరలకు విక్రయించడం, మొదట్లో ఒకధర చూపెట్టి.. అనంతరం అదనపు చార్జీలు (డ్రిప్ ప్రైసింగ్), మభ్యపెట్టే ప్రకటనలు, చిరాకు తెప్పించడం, తికమకపెట్టే ప్రశ్నలు, సాస్ (సాఫ్ట్ వేర్ యాజ్ ఎ సర్వీస్) బిల్లింగ్, తప్పుడు మాల్వేర్‌లు.

ఐఐటీ (బీహెచ్‌యూ) సహకారంతో 2023 అక్టోబర్ 26న ప్రారంభించిన మోసపూరిత నమూనాల నిరోధక హ్యాకథాన్ ఈ విభాగం చేపట్టిన నిర్దేశక కార్యక్రమాల్లో ఒకటి. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ ఆవిష్కరణల పోటీ సాంకేతిక మార్గాలను రూపొందించేందుకు ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థులు, వ్యక్తులను ఆహ్వానించింది. మోసపూరిత నమూనాలను గుర్తించి, అరికట్టేందుకు యాప్‌లు, బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లు, ఏఐ సాధనాల వంటి పరిష్కారాలను రూపొందించే దిశగా వారిని ప్రోత్సహిస్తోంది. హ్యాకథాన్ ఫలితాల ఆధారంగా ఐఐటీ (బీహెచ్‌యూ) సహకారంతో మూడు శక్తిమంతమైన వినియోగదారు రక్షణ యాప్‌లను రూపొందించింది. 2024లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వీటిని ప్రారంభించారు.

మోసపూరిత పద్ధతులను గుర్తించి, నివారించడం కోసం సంబంధిత విభాగం విస్తృతంగా వినియోగదారుల అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. అంతేకాకుండా ఇ-కామర్స్ వేదికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఇ-కామర్స్ లో వినియోగదారుల రక్షణ కోసం సమగ్ర, సమ్మిళిత విధానాన్ని రూపొందించడం కోసం ఇ-కామర్స్ వేదికలు, విధాన నిర్దేశక మేధో సంస్థలు, వినియోగదారుల సంస్థలతో నిరంతరం చర్చిస్తోంది.

వినియోగదారుల రక్షణ, సులభతర వాణిజ్యం వేర్వేరు కావని, అవి పరస్పరం పూరకమైన లక్ష్యాలని వినియోగదారుల వ్యవహారాల విభాగం విశ్వసిస్తోంది. వ్యాపారాలకు సమాన అవకాశాలను ప్రోత్సహిస్తూ.. నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా నిర్వహణలో ఈ విభాగం అనుసరిస్తున్న పురోగామి, భాగస్వామ్య విధానాలకు ఈ సమావేశం నిదర్శనం.

ఇలాంటి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా... వినియోగదారుల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చే, డిజిటల్ మార్కెట్లను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, జవాబుదారీగా నిర్వహించేలా భవిష్యత్ విధానాలను సాధించే దిశగా వినియోగదారుల వ్యవహారాల విభాగం ముందుకు వెళుతున్నది.

అమెజాన్ నిధులతో కొత్తగూడ సున్నంచెరువు సుందరీకరణ.. హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

హైదరాబాద్, మే 26:ఒకప్పుడు ఆ చెరువు కట్టకు ఇరువైపులా అడవిలా ఉండేది. ఎక్కడ చూసినా చుట్టూ ముళ్ల కంచ, పూర్తిగా శిథిలావస్థమై ఎప్పుడు తెగిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో రైతులతో పాటు మత్స్యకారులు ఆందోళన చెందేవారు, కట్టపై నడవడానికి దారి సక్రమంగా లేక ఏళ్లుగా అలుగుపై ఇబ్బందులు పడుతున్న తరుణం.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ సున్నం చెరువు పరిస్థితి. ఈ తరుణంలో అమెజాన్ సంస్థ దత్తత తీసుకొని అభివృద్ధి, సుందరీకరణ చేయడానికి ముందుకు వచ్చింది.

అమెజాన్ సంస్థ చేపట్టిన ఈ సుందరీకరణ పనుల్లో భాగంగా ముందుగా కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంచెను తొలగించారు. అనంతరం కట్ట మరమ్మతు చేశారు. ఈ క్రమంలో అరకిలోమీటర్ వరకు ఉన్న కట్టను వెడల్పు చేసి రాతి కట్టడాలను ఏర్పాటు చేశారు. అలాగే అలుగుకు మరమ్మతులు చేశారు. చెరువు కట్ట పటిష్టం చేయడంతో పాటు మహిళలు బతుకమ్మలు ఆడుకోవడానికి అన్ని వసతులను కల్పించారు.స

కట్ట మరమ్మతులతో పాటు చెరువులోకి నీరు ప్రవహించేలా పనులు చేపట్టారు. చెరువు నిండిన తర్వాత అలుగు ద్వారా గొలుసు కట్టు కాలువలు నుంచి రాచులూరు, తిమ్మాపూర్, చెరువులో నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి నీరు చేరుతుంది .

సున్నం చెరువు మరమ్మతు కారణంగా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఒక్కసారి చెరువు నిండితే సున్నం చెరువు కింద ఉన్న 246 ఎకరాల ఆయకట్టులో సాగుకు లోటు ఉండదు. నవీన గ్రామాల్లోనూ భూగర్భ జలాల పెంపునకు ఇది దోహదపడుతుంది. అలాగే రెండేళ్ల వరకు మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. కాగా, అమెజాన్ సంస్థ నిధులతో సున్నం చెరువును అభివృద్ధి చేయడంపై సమీప గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమెజాన్ సంస్థకు రుణపడి ఉంటామని చెబుతున్నారు.

ప్రజావాణిలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ రాజర్షి షా

హైదరాబాద్, మే 26: ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

కలెక్టర్మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ప్రజావాణి లో 128 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, పెన్షన్, తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఉద్యమకారులు వినతిపత్రాన్ని ఉందించారు.

కలెక్టర్‌ను కలిసిన వారిలో చాకటి కిరణ్, సామ నాగిరెడ్డి, ఎల్టీ సురేందర్ రెడ్డి, సయ్యద్ సుజాత్ అలీ ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కో సీసీ కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం: ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా

హైదరాబాద్, మే 26: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వలన కాలనీల్లో భద్రత పెంపొందుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తెలిపారు.

హైదరాబాద్ కొత్తపేట డివిజన్ పరిధి న్యూ మారుతి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్ తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ.. ఒక్కో సీసీ కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానమని తెలిపారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిసా వెంటనే సీసీ కెమెరాలు ద్వారా గుర్తించవచ్చునని పేర్కొన్నారు.

జననీ యాత్రను సద్వినియోగం చేసుకోవాలి : బుర్రి శ్రీనివాస్ రెడ్డి

నల్గొండ, మే 26:పిల్లలు లేని దంపతుల కోసం ఓయాసిస్ ఫర్టిలిటీ ఆధ్వర్యంలో అధునాతన సంతాన సౌకర్య పరిష్కారాలతో ఏర్పాటు చేసిన జననీ యాత్రను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీ కళాశాల ప్రాంగణంలో జననీ యాత్ర కార్యక్రమాన్ని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జననీ యాత్రలో పిల్లలు కాని దంపతుల కోసం ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించి వారికి సంతానం అందిస్తారని తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 13 పట్టణాల్లో 400 జంటలకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ సాయి మాసన దార్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడిలో కిడ్స్ జోన్‌ను ప్రారంభించిన ఏఎస్పీ చిత్తరంజన్

ఆదిలాబాద్, మే 26: కుమరం భీం జిల్లా వాంకిడి పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ కిడ్స్ జోన్‌ను ఆసిఫాబాద్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ సోమవారం ప్రారంభించ

లివర్‌పూల్ విశ్వవిద్యాలయానికి ఎల్ఓఐ అందించే కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, మే 26:న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన లివర్‌పూల్ విశ్వవిద్యాలయానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) అందించే కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షత వహించారు. యుజిసి (భారతదేశంలో విదేశీ ఉన్నత విద్యా సంస్థల అనుబంధ కళాశాలల ఏర్పాటు - నిర్వహణ) నిబంధనలు, 2023 ప్రకారం ఎల్ఓఐ జారీ అయిన రెండో విదేశీ విశ్వవిద్యాలయమిది.

భారత్‌లో బ్రిటిష్ హైకమిషనర్ శ్రీమతి లిండీ కామెరూన్ సీబీ ఓబీఈ, యుజిసి తాత్కాలిక ఛైర్మన్, విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి శ్రీ డాక్టర్ వినీత్ జోషి, లివర్‌పూల్ యూనివర్సిటీ వైస్-ఛాన్సెలర్ ప్రొఫెసర్ టిమ్ జోన్స్, లివర్‌పూల్ యూనివర్సిటీ గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ అండ్ పార్టనర్‌షిప్స్ ప్రో-వైస్-ఛాన్సెలర్ ప్రొఫెసర్ తారిఖ్ అలీ, విదేశీ వ్యవహారాల శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్లకు చెందిన అధికారులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాయల్ కాలేజ్ ఆఫ్ అబ్స్టెట్రీషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ (ఆర్‌సీఓజీ), ఆస్ట్రాజెనెకా ఫార్మా ఇండియా లిమిటెడ్, యూవీకెన్, డ్రీమ్11 వంటి కంపెనీలు, సంస్థలతో భవిష్యత్ సహకార అవకాశాల అన్వేషణ లక్ష్యంగా ఈరోజు మూడు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై సంతకాలు కూడా చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ ప్రధాన్ మాట్లాడుతూ, ప్రపంచ ఉన్నత విద్యలో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఆవిర్భవించడాన్ని ఈ ఎల్ఓఐ పునరుద్ఘాటిస్తుందన్నారు. ప్రముఖ ప్రపంచ విశ్వవిద్యాలయాలతో విద్యా భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకునే దిశగా భారత ప్రయాణంలో ఇది మరో మైలురాయి అవుతుందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం 2020 పరివర్తనాత్మక దార్శనికతలో దృఢంగా పొందుపరచి ఉన్న ఆకాంక్షగా దీనిని ఆయన అభివర్ణించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాటలను పునరుద్ఘాటిస్తూ, 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలనే లక్ష్యాన్ని ప్రధానమంత్రి నిర్దేశించారని కేంద్ర విద్యాశాఖ మంత్రి పేర్కొన్నారు. ఈ ఆశయాన్ని సాకారం చేసుకోవడానికి ఎన్ఈపీ 2020ని అక్షరాలా అమలు చేయడం కీలకమని ఆయన స్పష్టం చేశారు. మూలాలకు కట్టుబడిన, భవిష్యత్తు కోసం సన్నద్ధమైన, ప్రపంచస్థాయి విద్యను ఎన్ఈపీ 2020 ప్రాథమిక సిఫార్సుల్లో ఒకటిగా పేర్కొన్న ఆయన, దీని లక్ష్యం ప్రపంచస్థాయి పౌరులను తయారు చేయడమేనని తెలిపారు.

పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించాలని శ్రీ ప్రధాన్ కోరారు. లివర్‌పూల్ విశ్వవిద్యాలయం ఆవిష్కరణలకు దారితీసే ఎన్‌టీ ఈఎమ్-సంబంధిత పరిశోధనలపై దృష్టి సారిస్తుందని తెలిపారు. నవతరం నుంచి ప్రపంచస్థాయి పౌరులను తయారుచేయడం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఈ ఆవిష్కరణ కేంద్రం విశ్వవిద్యాలయానికి, సమాజానికి రెండింటి కోసం పరస్పర ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో తమ క్యాంపస్ ఏర్పాటు గురించి బహిరంగంగా ప్రకటించిన నాలుగో విదేశీ విశ్వవిద్యాలయంగా లివర్‌పూల్ విశ్వవిద్యాలయం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నాటికి, ముఖ్యంగా ఎన్‌టీఈఎమ్‌బీలో 15 విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో అనుబంధ కళాశాలలను ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

బెంగళూరులోని లివర్‌పూల్ విశ్వవిద్యాలయ ప్రాంగణం పరిశోధన, ఆవిష్కరణల హద్దులను అధిగమించి, ప్రపంచ సంక్షేమం, శ్రేయస్సుకు దోహదపడే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ప్రపంచస్థాయి అనుబంధ కళాశాలగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సుస్థిరత్వం, ఆరోగ్యం, శ్రేయస్సు, సమృద్ధి నేటి ప్రపంచపు సాధారణ ఎజెండాగా పేర్కొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి, విశ్వవిద్యాలయాలు వీటి కోసం హాట్‌స్పాట్‌లుగా ఉన్నాయని తెలిపారు. 'వసుధైక కుటుంబం' భావనతో ప్రపంచ ఎజెండాను కొనసాగిస్తూ, ప్రపంచ బాధ్యతలను నెరవేర్చడానికి భారత్ తగిన ప్రదేశమని ఆయన అన్నారు.

డాక్టర్ వినీత్ జోషి మాట్లాడుతూ, లెటర్ ఆఫ్ ఇంటెంట్ కేవలం ఒక వేడుకను సూచించేది మాత్రమే కాదని, ఇది భారత ఉన్నత విద్యా వ్యవస్థలో కొనసాగుతున్న విస్తృత, లోతైన పరివర్తనను ప్రతిబింబిస్తుందన్నారు. ఇది వ్యూహాత్మక సంస్కరణ, అంతర్జాతీయ భాగస్వామ్యం, విధానపరమైన బలమైన పునాది ద్వారా కొనసాగుతుందని తెలిపారు. భారతీయ విద్యను మరింత సమ్మిళితంగా, ప్రపంచంతో పోటీపడేలా, భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉంచే లక్ష్యంతో ఎన్ఈపీ 2020 లక్ష్యాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు. ఎన్ఈపీ 2020 పరివర్తనాత్మక ఎజెండాలో భాగంగా ఉన్న అంతర్జాతీయీకరణ ఒక ప్రధాన ప్రాధాన్యంగా మారిందన్న ఆయన, ఇది ప్రపంచ కనెక్టివిటీ, ఉన్నత ప్రమాణాలు, సంస్థాగత సౌలభ్యంపై ప్రధానంగా దృష్టి సారిస్తుందని తెలిపారు.

లివర్‌పూల్ విశ్వవిద్యాలయం బెంగళూరులో తొలి విదేశీ విశ్వవిద్యాలయ క్యాంపస్‌ను ప్రారంభించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి ఆమోదాన్ని పొందింది. 2026, ఆగస్టులో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల మొదటి బ్యాచ్‌ను స్వాగతించేలా షెడ్యూల్ చేసిన ఈ క్యాంపస్‌లో.. మొదట బిజినెస్ మేనేజ్‌మెంట్, అకౌంటింగ్-ఫైనాన్స్, కంప్యూటర్ సైన్స్, బయోమెడికల్ సైన్సెస్ వంటి ప్రోగ్రామ్‌లను అందించనున్నారు. ముఖ్యంగా, ఇది గేమ్ డిజైన్‌లో ఒక ప్రోగ్రామ్‌ను కూడా ప్రవేశపెడుతుంది. భారత్‌లోని యూకే విశ్వవిద్యాలయ క్యాంపస్ ఒక ప్రత్యేకమైన ఆఫర్‌గా ఈ వినూత్న సబ్జెక్టును అందించనుంది. ఈ కొత్త క్యాంపస్ అంతరాష్ట్రీయ విద్య కోసం యూకే విద్యార్థులకు ఒక ఉత్తేజకరమైన గమ్యస్థానంగా ఉంటూ, ప్రపంచస్థాయి జ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు సమృద్ధిగా అవకాశాలు కల్పించనుంది.

బెంగళూరు క్యాంపస్ పరిశోధనాభివృద్ధి కోసం అన్ని రకాల వసతులు, సదుపాయాలను అందించనుంది. ముఖ్యమైన ప్రాథమిక, అనువర్తిత, పరిశ్రమ ఆధారిత పరిశోధనలకు బెంగళూరు క్యాంపస్ వేదికగా మారనుంది, ఇది ప్రపంచస్థాయి, స్థానిక సవాళ్లు అలాగే అవసరాల కోసం పరిష్కారాలను అందిస్తుంది. యాజమాన్యాలతో విశ్వవిద్యాలయానికి గల సుస్థిర సంబంధాలు, విజయవంతమైన పూర్వ విద్యార్థులు, వ్యాపారం, వ్యవస్థాపక కార్యకలాపాల కోసం మెరుగైన మద్దతు ద్వారా ఈ క్యాంపస్ విద్యార్థులు విజయవంతంగా తాము ఎంచుకున్న కెరీర్ కొనసాగించడానికి.. ఉన్నత చదువులకు వెళ్లడానికి అవసరమైన నైపుణ్యాలను అందించనుంది.

నిజమైన అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా, ఇది లివర్‌పూల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా విద్యాపరమైన, వృత్తిపరమైన, వ్యక్తిగతమైన అభివృద్ధి కోసం ముఖ్యమైన అవకాశాలను.. నేటి పరస్పర అనుసంధానిత ప్రపంచంలో విజయం సాధించడానికి అవసరమైన అంతర్జాతీయ దృక్పథాన్ని పొందే వీలున్న గ్లోబల్ మొబిలిటీ స్కీమ్‌ను కూడా భారత విద్యార్థులకు అందుబాటులో ఉంచనుంది. ప్రపంచ పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన, విభిన్న అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలు, విద్యార్థులను అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌లో పోటీ పడటానికి, ప్రపంచ శ్రామిక శక్తికి అర్థవంతమైన తోడ్పాటును అందించడానికి సిద్ధంగా ఉండే పట్టభద్రులుగా తీర్చిదిద్దనున్నాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా 'ది ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ అండ్ బియాండ్', 'ది ఇండియా?యూకే ఛాలెంజ్ ఆఫ్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎమ్ఆర్)' అనే శీర్షికలతో రెండు ప్యానెల్ చర్చలు కూడా నిర్వహించారు.

లివర్‌పూల్ విశ్వవిద్యాలయం గురించి

1881లో ఒరిజినల్ 'రెడ్ బ్రిక్'గా స్థాపించిన ఈ లివర్‌పూల్ విశ్వవిద్యాలయం, యూకేలోని పరిశోధనాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించే ప్రముఖ ఉన్నత విద్యా సంస్థలలో ఒకటిగా ఉంది. దీని వార్షిక టర్నోవర్ 708.3 మిలియన్ల యూరోలు. ప్రపంచవ్యాప్తంగా గల టాప్ 175 విశ్వవిద్యాలయాల్లో సుస్థిరమైన ర్యాంక్‌తో, యూకేలోని ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయాలతో కూడిన ప్రతిష్ఠాత్మక రస్సెల్ గ్రూపులో మెంబర్‌గా ఉంది. దేశంలోని అతిపెద్ద పౌర సంస్థల్లో ఒకటిగా మన విద్యా వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ ప్రపంచవ్యాప్త విస్తరణను, ప్రభావాన్ని కలిగి ఉంది.

వాంకిడిలో కిడ్స్ జోన్‌ను ప్రారంభించిన ఏఎస్పీ చిత్తరంజన్

ఆదిలాబాద్, మే 26: కుమరం భీం జిల్లా వాంకిడి పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ కిడ్స్ జోన్‌ను ఆసిఫాబాద్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే ఆట పాటలు, వ్యాయామంతో జీవితాన్ని ఆరోగ్యకరంగా ఆనందంగా , ఆహ్లాదకరం ఉంచుకోవాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ లో నివసించే చిన్నారులు, బయటి విద్యార్థులు ఈ కిడ్స్ జోన్ ను మూర్తిస్థాయి లో ఉపయోగించుకోవాలన్నారు. ఆటలు ఆడుతూ, వ్యాయామం చేస్తూ, ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ లో పిల్లల కోసం కిడ్స్ జోన్ ను ఏర్పాటు చేయ డం అభినందనీయమన్నారు. వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ కెరమెరి ఎస్సై మధుకర్, వాంకిడి ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు

ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి-అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా కలెక్టర్.

మహబూబాబాద్, మే 26:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల వారితో సమన్వయ పరుస్తూ దరఖాస్తుదారులకు దిశ నిర్దేశం చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ విధంగా వివిధ శాఖల కు చెందిన (122) మొత్తం దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రవాణా తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై సమీక్ష నిర్వహించారు, ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, డిఏఓ విజయనిర్మల, హార్టికల్చర్ అధికారి మరియన్న, గ్రౌండ్ వాటర్ డిడి సురేష్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, మత్స్య శాఖాధికారి వీరన్న, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, డిపిఓ హరిప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, మే 26: మోతీ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న మోతినగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎస్ వి ప్రసాద్ నేతృత్వంలో సొసైటీ సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ మ్యానిఫెస్టోను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు బాగున్నాయని.. మోతీ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సొసైటీలో కొందరు సభ్యులు నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అంశాన్ని తానే స్వయంగా డిప్యూటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాసిన తర్వాతే ఆ విషయం వెలుగులోకి వచ్చిందని గుర్తు చేశారు. మోతీ నగర్ ప్రజలు విజ్ఞతతో కూడిన ఓటర్లను, మంచి ప్యానెల్‌ను ఎన్నుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన కేటీఆర్

హైదరాబాద్, మే 26: తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (ఏఈ) రజతోత్సవ సంబురాల పోస్టర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించిన టీజేఎఫ్.. 25 వసంతాల సంబురాలు జరుపుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు.

దశాబ్దాల పాటు దగాపడ్డ తెలంగాణ ప్రజల విముక్తి కోసం కేసీఆర్ సారథ్యంలో సాగిన మలి దశ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచడంలో తెలంగాణ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని కేటీఆర్ గుర్తుచేశారు.

తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నో రకాల కార్యక్రమాలు అమలు చేశామని, టీజేఎఫ్‌కి తాము ఎప్పటికీ అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఈ నెల 31వ తేదీన జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవాలకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్దఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా అల్లం నారాయణ కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూజే కోశాధికారి పి.యోగానంద్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాకేశ్ రెడ్డి, సోమేశ్, కోశాధికారి బాపు రావు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, చిక్కులు శ్రీనివాస్, ప్రవీణ్, నతీశ్, దిలీప్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి..

-బాలల హక్కుల వేదిక సంతకాల సేకరణ

హైదరాబాద్, మే 26: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల జులుం తగ్గించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల నియంత్రణ కోసం తెలంగాణ ప్రభుత్వం చట్టం తీసుకురావాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం నాయకులు నరేందర్, వెంకటస్వామి, సరిత, నరేందర్, ముకుందం డిమాండ్ చేశారు.

రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలాపూర్ మండల వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టారు. విద్య వ్యాపారాన్ని అరికట్టాలన్న ఉద్దేశంతో సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చట్టం తీసుకురాకపోతే ఫీజుల నియంత్రణ ఉండదని అన్నారు. బడంగ్‌పేట మండలవ్యాప్తంగా బ్యానర్లు ఏర్పాటుచేసి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సమస్యలను ఏర్పాటుచేసి అవసరమైన సిబ్బందిని నియమించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాల నిర్వీర్యం అవుతున్న క్రమంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలలో పేద, మధ్య తరగతి పిల్లలను చదివించడానికి లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోయారు. ఫీజులతోపాటు, పుస్తకాల వ్యాపారం, డ్రెస్సులు, షూ,టై, తదితర వాటిని ప్రైవేటు స్కూళ్లలోనే తీసుకోవాలని నిబంధనలు పెట్టారన్నారు.

చాలామంది పేదలు అప్పులు చేసి మరీ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలలో చదివిస్తున్నారని బాలల హక్కుల పరిరక్షణ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల యజమానుల ఆగడాలకు అంతుపొంతూ లేకుండా పోయిందన్నారు. ప్రతి కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలో 25 శాతం మందికి ఉచితంగా సీటు ఇవ్వాలని చాలా నిబంధనలు ఉన్నప్పటికీ ఏ పాఠశాల అమలు చేయడం లేదని తెలిపారు. ప్రభుత్వాలు చట్టం తీసుకురాకపోవడం వల్లనే ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. ఎవరికి వారు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలపై విద్యాధికారుల పర్యవేక్షణ కూడా ఉండటం లేదని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులు నియంత్రణ చేసే వరకు సంతకాలను సేకరణ చేపడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. విద్యా హక్కు పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి విద్యా సంవత్సరం ప్రారంభంలోని చట్టం తీసుకురావాలన్న ఉద్దేశంతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

జీలుగతో పంటలకు సేంద్రీయ పోషకాలు : ఏఓ వెంకటేశ్వర్లు

నల్గొండ, మే 26: జీలుగతో పంటలకు సేంద్రీయ పోషకాలు అందుతాయని సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో వ్యవసాయ శాఖ తరపున రైతులకు పచ్చి రొట్ట పైరు విత్తనాలు, జిలుగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మండలానికి 40 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, 30 కేజీల పూర్తి ధర రూ. 4,275/-,ప్రభుత్వ 50% రాయితీ పోను రైతు రూ. 2,137/-చెల్లిస్తే సరిపోందన్నారు. జిలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లను ఉపయోగించడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, ఇది భూమికి సేంద్రీయ పోషకాలను అందిస్తుందని, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందిస్తూ దిగుబడులను పెంచుతుందన్నారు. పచ్చిరొట్టను పొలంలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, శైలజ, మానస, వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది మహేందర్, రామకృష్ణ, రైతులు రమేశ్‌రావు, సతీశ్, వీరభద్రయ్య ఫాల్గొన్నారు.

కవిత లేఖ తో కాంగ్రెస్‌కి వచ్చే నష్టంఏం లేదు...

-తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ బలంగానే ఉంటది
-కవిత ఎపిసోడ్...బీజేపీ కి బలం పెంచేలా ఉన్నాయి...
-సిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కవిత లేఖ తో కాంగ్రెస్ కి వచ్చే నష్టంఏం లేదని, తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ బలంగానే ఉంటదని పిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ కి పదేళ్లు అవకాశం ఇచ్చారు .. తర్వాత కాంగ్రెస్ కి ఇచ్చారు కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బంది లేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెళ్లు ఉంది అన్ని రాజకీయ పార్టీల్లో అంతర్గత విషయాలు ఉంటాయి వారం నుండి కవిత రాసిన లేఖల గురించి చర్చ జరుగుతుంది కేసీఆర్ కుటుంబం లో లేఖల కలకలం.. నడుస్తుంది . ఏదో జరుగుతుంది అనే చర్చ నడిసింది. కవిత ఎపిసోడ్ పై రకరకాల వార్తలు వస్తున్నాయి కవిత కొత్త పార్టీ అనే చర్చ నడుస్తుంది బలంగా లేని పార్టీ బీజేపీ పార్టీ అన్ని అన్నారు.. కేసీఆర్ కి రాష్ట్ర విభజన అంశం తో ఓటేశారు . కాంగ్రెస్ కి పాలన చూసి ఓటేస్తారు ప్రజలు ఇందిరా గాంధీ మొదలు కొని... సోనియా..రాహుల్ గాంధీ వరకు మంచి పరిపాలన అందిస్తారు అని అవకాశం ఇస్తున్నారన్నారు.. మతం పేరుతో .. బీజేపీ రాజకీయం చేస్తుంది రాష్ట్ర రాజకీయాల్లో ముందు కాంగ్రెస్.. రెండో స్థానంలో బిఆర్ఎస్ మూడో స్థానం లో బీజేపీ ఉంది కేసీఆర్ కుటుంబ పంచా యతీ.. రాజకీయంగా వాళ్లకు నష్టందాని నుండి ఎలా బయట పడాలి అనేది వాళ్ళు చూస్తున్నారుకుటుంబ తగాదా తో బిఆర్ఎస్ క్యాడర్ డిసప్పాయింట్ అవుతారు... ఆ క్యాడర్ బీజేపీ వైపు వెళ్లే అవకాశం ఉంటుందికవిత లేఖ తో బిఆర్ఎస్ క్యాడర్..లీడర్స్ బీజేపీ వైపు వెళ్లే ప్రమాదం ఉందిఎవరికి వాళ్ళు నేను ఏదో అనే ఫీలింగ్ మంచిది కాదు ఎవరు ఒప్పుకు న్నా.. ఒప్పుకోకపోయినా కేసీఆర్.. కేసీఆరే ఆయనతోనే ఆ పార్టీకి ఉనికి.. కేటీఆర్... హరీష్..కవిత ల వల్ల ఏం కాదుకవిత స్వతహాగా లీడర్ కాదు. కేసీఆర్ నీ దేవుడు అంటూ నే...కవిత ఏ చెట్టు నీడలో బతుకు తున్నారు... ఆ చెట్టు నరికేస్తున్నది కూర్చున్న చెట్టు కొమ్మని నరికినట్టు ఉంది కవితకవిత ఎపిసోడ్...బీజేపీ కి బలం పెంచేలా ఉన్నాయి...అంత రాజకీయ ఆలోచన లేదా..కేసీఆర్ నీ దేవుడు అంటూ నే...రాజకీయ జీవిత సమాధి చేస్తున్నావు కవిత కవిత డిప్రెషన్ లో ఉంది...తొందర పడి లేఖ విడుదల చేశారు బీజేపీ నీ పెంచి పోషించే పరిస్థితి లో ఉన్నారు కాంగ్రెస్ నేతలు అలెర్ట్ అవ్వాల్సిన సమయం వచ్చింది లేఖలు లీకులు మీడియా లో లైవ్ లో కనిపిస్తాయి కానీ.. బిఆర్ఎస్ రాజకీయ ఆత్మహత్య చేసుకుని.. బీజేపీ నీ పెంచే పని జరుగుతుంది కేసీఆర్ లేకుంటే బిఆర్ ఎస్ లేదు.. కేసీఆర్ నీ దేవుడు అం టూనే కొంప ముంచుతుంది రాష్ట్రంలో ఉనికి లేని బీజేపీ నీ...మీ ఇంట్లో పంచాయతీ మూలంగా బిజెపి కి బలం ఇచ్చే ప్రయత్నం భవిష్యత్ నీ దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అలెర్ట్ అవ్వాలికవిత తండ్రి మీద దండయాత్ర చేస్తూ... కేసీఆర్ కొంప ముంచి బీజేపీకి బలం ఇస్తుందన్నరు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏడీఏ శాంతి నిర్మల

యాదగిరిగుట్ట, మే 26 : అనుమతి లేని విత్తనాలతో పాటు నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏడీఏ శాంతి నిర్మల హెచ్చరించారు. సోమవారం యాదగిరిగుట్ట మండల వ్యవసాయాధికారి ఐ.సుధారాణితో కలిసి మండల పరిధిలోని విత్తన డీలర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిపోర్టు, స్టాక్ బోర్డు, విత్తన నిలువలను పరిశీలించారు. మండలానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పరుగుల మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎమ్మార్పీ ప్రకారమే విత్తనాలు విక్రయించాలని షాపుల యజమానులను సూచించారు. అధిక ధర విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

"ఆపరేషన్ సిందూర్" సైనిక చర్య చరిత్రలో గర్వకారణమైన అధ్యాయం

-దేశీయ టెక్నాలజీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.
-భారత యువతకు డా. ర్యాగ రిషి అరుణ్ పిలుపు

హైద్రాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ న్యూస్)దేశ భద్రత మరియు గౌరవం విషయంలో భారత ప్రభుత్వం తీసుకున

4వ ఆర్థిక శక్తిగా భారత్

-జపాన్‌ను వెనక్కి నెట్టిన ఇండియా భారత్ కన్నా ముందున్న
-అమెరికా, చైనా, జర్మనీ నీతి ఆయోగ్ ప్రకటన
-మరోరెండేళ్లలో మూడో స్థానానికి ఎగబాకే అవకాశం

న్యూఢిల్లీ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారతదేశం ఇప్పుడు 4వ అతి పెద్ద ఆర్థి క శక్తివంత దేశంగా అవతరించిందని నీతి ఆయో గ్ కార్యనిర్వాహణాధికారి (సిఇఒ) బివిఆర్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కీలక మైలురాయి సాధన దిశలో మనం జపాన్‌ను వెనకకు నెట్టివేశామని వివరించారు. ఇది మనకు మనం చెప్పుకునే ప్రగ తి కాదని, ఐఎంఎఫ్ ఇతర అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు వెలువరించిన తాజా గణాంకాల, నివేదికల క్రమంలో వెలుగులోకి వచ్చిన సత్యం అని వివరించారు. తాను ఈ ప్రగతి పథం గురించి వివరిస్తున్న దశలో మన ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో బలోపేతంగా ఉందని తెలిపారు.ఇది మన నాలుగవ స్థానాన్ని నిర్ధారించింది. ఇం తటితో ఆగిపోకుండా మనకు అన్ని రకాలుగా భౌ గోళిక రాజకీయ, ఆర్థిక అనుకూల పరిస్థితులు పలు విధాలుగా ఊతం ఇస్తున్నాయని సిఇఒ చె ప్పారు. అమెరికా, చైనా, జర్మనీ తరువాతి స్థానం మనదే అని, ఈ ప్రగతి పథం వేగం మరింత ఇనుమడిస్తే ఇక మనం వచ్చే రెండేళ్లలోనే మూడవ ఆర్థిక శక్తివంత దేశంగా నిలుస్తామని తెలిపారు. గత ఏడాది చివరి వరకూ ఇండియా జపాన్ కన్నా వెనుక ఉండి, ఐదవ ఆర్థిక శక్తిగా జాబితాలో ఉం ది. అయితే జపాన్‌ను మనం తోసి రాజన్నామని తెలిపారు. ఎప్రిల్‌లో ఐఎంఎఫ్, వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ సంస్థల నివేదిక వెలువడింది. ఇందులో ఇండియా నాలుగవ ఆర్థిక శక్తి కానుందని తెలిపారని గుర్తు చేశారు. దేశ జిడిపి ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో 4.187 బిలియన్ డాలర్లు దాటుతుంది. ఇది జపాన్ ఆర్థిక శక్తిని దాటేయడం కిం దికి తీసుకోవచ్చు. ఇక తలసరి ఆదాయం క్రమంలో భారతదేశ వివరాలు ఐఎంఎఫ్ డేటా ప్రకారం చూస్తే ఏడాదిలో రెండింతలు అయింది. పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల విశ్వసనీయ ప్రతిష్టాత్మక నివేదికలలో కూడా భారత్ అజేయ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న వైనం స్పష్టం అవుతోందని సిఇఒ తెలిపారు. ఐఎంఎఫ్ తమ ప్రపంచ ఆర్థిక .పరిస్థితి నివేదికలో భారతదేశ ఆర్థిక రంగం 2025 26 ఆర్థిక సంవత్సరం లో 6.2 శాతం ఎదుగుదల ఉంటుందని విశ్లేషించింది. నిర్ణీత ఆరున్నర శాతంతో పోలిస్తే కొద్దిగా మందగమనం ఉంటున్నప్పటికీ పరిస్థితి ద్విగుణీకృత రీతిలో ఉందని తెలిపారని సిఇఒ చెప్పారు. ఈ విషయాలన్నింటిని సిఇఒ ఇటీవలి నీతి ఆయోగ్ భేటీలో పమర్శించిన వికసిత్ రాజ్య వికసిత్ భారత్ ఏ2047 నివేదికలో తెలిపారు. ఇంతకు ముందటి వరకూ బలహీన స్థాయి ఐదవ ఆర్థిక శక్తిగా మన దేశందశాబ్ద కాలంలో బలీయ ఆర్థిక శక్తివంత దేశంగా ఎదిగింది. ఇది ఇప్పుడు నాలుగో అతి పెద్ద ఆర్థిక శక్తిగా మారడం తిరుగులేని విజయం అని నీతి ఆయోగ్ నిర్వాహక అధికారి వివరించారు. ఇక భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్ణీత 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుని తీరుతుందని వివరించారు.

క్రెడిట్ మోడీదే: కేంద్ర మంత్రి జితేంద్ర

భారత్ ఇప్పుడు జపాన్‌ను దాటేసి, నాలుగో ఆర్థిక శక్తివంత దేశం అయిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ఆదివారం జమ్మూకు వచ్చిన ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోడీ 11 సంవత్సరాల పాలనలో సాధించిన నత్పలితాలు, సాగిన ప్రగతి ప్రతిఫలంగానే ఇప్పుడు భారత్ ఈ విశిష్టతను సాధించామని మంత్రి తెలిపారు. జాతికి ఇంతటి ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత ఆయనదే అన్నారు.నీతి ఆయోగ్ నివేదిక క్రమంలో భారత్ ప్రగతి పథం గురించి ప్రపంచానికి తెలిసింది. మన రక్షణ వ్యవస్థను మనం తీర్చిదిద్దుకున్నామని, 2014లో అధికారంలోకి వచ్చినప్పటి పరిస్థితితో పోల్చుకుంటే చాలా వ్యత్యాసం ఉందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్షం భారత్‌కు కీలకం అని, ఈ దిశలోనే మనం ముందుకు సాగుతున్నామని , ఇప్పుడు మ నం సంపాదించుకున్న 4వ ర్యాంకుతో తేటతెల్లం అయిందని మంత్రి విశ్లేషించారు. నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం వెలువరించిన నివేదికలోని అం శాలు భారతీయులందరికీ సంతోషదాయకం అన్నారు. అన్నింటికి ముందు ఈ శుభవార్త పట్ల తాను ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నానని ప్రధా న మంత్రి కార్యాలయంలో సహాయ మంత్రి అయిన జితేంద్ర సింగ్ చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి

-బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ చింతల రామచంద్రారెడ్డి

హైదరాబాద్ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేసారు. ఫసల్ బీమా కింద కేంద్రం ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు నష్టం భరించేందుకు సిద్ధంగా ఉంది, కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదన్నారు.సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియా అమావేశం లో మాట్లాడుతూ ఎద్దేడిస్తే రైతులు ఎంతగా బాధపడతారో మనకు తెలుసు. రైతు ఏడిస్తే మన తెలంగాణ రాష్ట్రం కూడా బాధపడుతుంది.గతంలో కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల దుస్థితిపై పట్టించుకోలేదన్నారు.. ఈనాడు సుమారు 30 లక్షల టన్నులు పరిధాన్యం తడిసి పోయింది. ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మహబూబ్నగర్ జిల్లాలో 51 ఏళ్ల గుగ్గలోత్ కిషన్, సూర్యపేట అన్నారం గ్రామంలో రైతు ఉప్పల వెంకన్న, జనగాం వెల్జీ గ్రామంలో యాదగిరి వంటి రైతులు నష్టాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 442 మంది రైతులు చనిపోయారు.కేంద్ర ప్రభుత్వం ప్రతి పంటకు 2320 రూపాయల ఎంఆర్పీ అందిస్తోంది. పంట కొనుగోలు ఖర్చు అంతా కేంద్రమే భరిస్తోంది.కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు పని కల్పించకుండా, పంట కొనుగోలు సరిగ్గా జరపకుండా రైతులను ఇబ్బంది పెడుతోంది.కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ఇస్తూ, 10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించింది.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు, రైతులను మోసం చేస్తున్నారు.ఫసల్ బీమా కింద కేంద్రం ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు నష్టం భరించేందుకు సిద్ధంగా ఉంది, కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదని విమర్శించారు..పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సౌర విద్యుత్ వ్యవస్థలు, 24 గంటల కరెంట్, నీరు అందిస్తున్నారు, కానీ తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కల్పించడం లేదు.మాన్సూన్ ముందస్తు హెచ్చరికలు వచ్చినా క్రాపింగ్ ప్లానింగ్ చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన ఆలోచన లేదు.రుణమాఫీ గురించి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మాటలు చెప్పినా, ఎంత మందికి పూర్తిగా ఎంత రుణమాఫీ చేశారో చెప్పలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం వల్ల రైతులకు తీసుకున్న లోన్లపై వడ్డీ, చక్రవడ్డీ వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు, మళ్లీ లోన్ దొరకడం లేదు.రైతు బంధు, రైతు కూలీలకు వాగ్దానం చేసినట్లుగా నగదు ఇవ్వడం లేదు, ఎందుకు ఇవ్వలేదు?డబ్బులు లేవని చెబుతూ హామీలు, పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు.కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏవీ అమలు చేయకుండా రైతులను, మహిళలను, విద్యార్థులను, యువకులను మోసం చేసింది.ప్రతి క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తానన్న డిక్లరేషన్ కూడా అమలు చేయలేదన్నారు..రైతులు పండించిన ప్రతి పంట కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం నిధులు ఇస్తోంది.సుతిలి, సంచి, కాంటాకు, హమాలికి, ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాంకులో మూడు నెలల కాలం వడ్డీ సహా అవసరమైన అన్ని డబ్బులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది.అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ 30 లక్షల టన్నుల ధాన్యం కొనకపోవడం, రైతుల జీవితాలతో చెలగాటం చేస్తోంది.పీఎం కుసుమ్ పథకం క్రింద 4000 మెగావాట్ల సౌరశక్తి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 30-40%, రాష్ట్ర ప్రభుత్వం 30% సబ్సిడీ ఇవ్వాలి. కాని దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందిని రామచంద్ర రెడ్డి దుయ్యబట్టారు.

పెద్దకల్వాల వద్ద కారు బోల్తా.. నలుగురికి స్వల్పగాయాలు

కరీంనగర్, మే 26: పెద్దపల్లి మండలం పెద్దకల్వాల సమీపంలో సోమవారం సాయంత్రం కాళేశ్వరం సరస్వతి పుష్కరస్నానాలకు వెళ్లి వస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. గాయాల పాలైన వారిని కరీంనగర్ దవాఖానకు చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా తరలించారు.స్థానికుల కథనం ప్రకారం కాళేశ్వరం సరస్వతీ పుష్కర స్నానాలకు వెళ్లి వస్తున్న కారును వెనుక నుంచి అదే వరుసలో వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో వరుసగా మూడు కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. కాళేశ్వరం వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో కరీంనగర్ కు వెళ్తుండగా పెద్దపల్లి మండలం పెద్దకల్వల సమీపంలో మహబూబ్ బేగ్ ఫంక్షన్ హాల్ ముందు వెనుక నుండి గుర్తు తెలియని వాహనం గుద్దడం వలన దాదాపు మూడు కార్లు ఒకదానికొకటి తగలడం వల్ల కారు వల్జీ కొట్టంది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు గాయాల పాలయ్యారు.

దశల వారీగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మే 26:ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఆయన మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి బాబా నగర్ దుర్గా నగర్, హనుమాన్ నగర్ కాలనీలో పర్యటించారు.

హిందూ ముస్లిం స్మశాన వాటిక, అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం కాలనీల్లో రోడ్ల సమస్యలపై కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నాల మహేందర్, జరిపోతుల భాస్కర్, భూపతి అశోక్, కందుల రాజు, దేవకుమార్, మూర్తి, ఎండి నయూమ్, జబ్బర్,రాజు గౌడ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాక్

కొమురంభీం మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్ పార్టీకి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాకిచ్చాడు. కాంగ్రెస్ పార్టీతో కోనప్ప తెగతెంపులు చేసుకున్నారు. కాంగ్రెస్‌కు దూరంగానే ఉన్నానని.. దూరంగానే ఉంటానని, రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ? ఏ పార్టీ లోకైనా వెళ్తా కానీ.. కాంగ్రెస్‌లోకి మాత్రం పోనని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ లో చేరానని.. కానీ, కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దేవుడు అని ఇదివరకే తాను చెప్పానని, ఆయనకు పాదాభివందనాలని కాంగ్రెస్ పార్టీలో చేరిన రోజే చెప్పానని కోనప్ప అన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించిన వ్యక్తిని పార్టీలో తీసుకునేటప్పుడు చెప్పలేదనే బిఆర్ఎస్ నుంచి బయటికి వచ్చానని.. రాజకీయంగా బిఆర్ఎస్, కెసిఆర్ కుటుంబంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. తాను మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్తాను కానీ కాంగ్రెస్ పార్టీలోకి మాత్రం వెళ్లను కోనప్ప చెప్పారు.

పాకిస్థాన్‌కి గూఢచర్యం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ ఉద్యోగి అరెస్ట్

న్యూ డిల్లీ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); పాకిస్థాన్‌కి గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్ట్ తర్వాత కేంద్రం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా పాకిస్థాన్ కోసం పని చేస్తున్న వ్యక్తులను జల్లెడ వేసి పట్టుకొనే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో ఇప్పటికే పలువురు అనుమానితుల్ని అరెస్ట్ చేశారు. తాజాగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సి ఆర్ పి ఎఫ్) (అఖీఖఈ) ఉద్యోగి మోతీరామ్ జాట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) (ఔఎం) అధికారులు అరెస్ట్ చేశారు. పాక్ ఇంటెలిజెన్స్ అధికారులకు మోతీరామ్ సున్నిత సమాచారం అందిస్తున్నట్లు గుర్తించారు. 2023 నుంచి పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో సిఆర్‌పిఎఫ్ (అఖీఖఈ) ఉద్యోగి మోతీరామ్ టచ్‌లో ఉన్నట్లు బయటపడింది.అనంతరం అతడిని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతనికి జూన్ 6వ తేదీ వరకూ ఎన్ఐఎ (ఔఎం) కస్టడీలో ఉండాలని ఆదేశించింది. మోతీరామ్‌పై వచ్చిన ఆరోపణలు దేశ భద్రతకు పెను ముప్పుగా మారే అవకాశం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. అతను పాకిస్థాన్‌కు ఏ విధమైన రహస్యాలు అందించాడో విచారణలో వెలికి తీయాలని పేర్కొంది. మోతిపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం సెక్షన్ 15, సెక్షన్ 16, సెక్షన్ 18 కింద కేసులు నమోదు చేశారు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పై హత్యాయత్నం!?

- హెలికాప్టర్‌పై డ్రోన్ల దాడి జరిగినట్లు ఊహాగానాలు

మాస్కో మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పై హత్యాయత్నం జరిగినట్లు తెలుస్తోంది. పుతిన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌పై డ్రోన్ల దాడి జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గుంపులు గుంపులుగా వస్తున్న డ్రోన్ల మధ్యలో పుతిన్ హెలికాప్టర్ చిక్కుకున్నట్లు చెప్పారు. అయితే ఆ దాడి నిజమే అని ఎయిర్ డిఫెన్స్ డివిజన్ కమాండర్ యురీ దాస్కిన్ తెలిపారు.గత మంగళవారం కుర్స్క్ ప్రాంతంలో పుతిన్ పర్యటించారు. ఏప్రిల్‌లో ఉక్రెయిన్ దళాల నుంచి ఆ ప్రాంతం విముక్తి పొందింది. ఈ నేపత్యంలో ఆ ప్రాంతాన్ని పుతిన్ విజిట్ చేశారు. తన పర్యటన సమయంలో గవర్నర్ అలెగ్జాండర్ కిన్షెటిన్‌ను కలివారు. అయితే ఆ సమయంలో ఉక్రెయిన్ డ్రోన్లు.. పుతిన్ హెలికాప్టర్‌ను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది.ఛానల్ రష్యా 1కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. శత్రు దేశం డ్రోన్లతో దాడి చేసిందని, ఆ దాడి సమయంలో పుతిన్ తన హెలికాప్టర్‌లో ఉన్నారని, సమర్థవంతంగా తమ దళాలు ఆ డ్రోన్ దాడిని తిప్పికొట్టినట్లు కమాండర్ దాస్కిన్ తెలిపారు. కుర్స్క్ ప్రాంతంలో పుతిన్ వర్యటిస్తున్న సమయంలో.. అసాధారణ రీతిలో యూఏవీలను ఉక్రెయిన్ వదలింది. అయితే తమ దళాలు 46 యూఏవీలను కూల్చినట్లు రష్యా కమాండర్ పేర్కొన్నారు.డ్రోన్ల దాడి సయమంలో తమ వైమానిక రక్షణ దళాలు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ కంబాట్ విన్యాసాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రెసిడెంట్ హెలికాప్టర్ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. శత్రు డ్రోన్లను తిప్పికొట్టామని, ఏరియల్ టార్గెట్లను పేల్చివేసినట్లు దాస్కిన్ తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సుమారు 764 ఉక్రెయిన్ డ్రోన్లను నేలకూల్చినట్లు రష్యా పేర్కొన్నది. శనివారం, ఆదివారం కూడా వందల సంఖ్యలో మానవరహిత వైమానిక వాహనాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ దేశాల సహకారంతో రష్యాపై దాడులకు ఉక్రెయిన్ తెగిస్తున్నట్లు విదేశాంగ మంత్రి తెలిపారు.

ఈ నెల 28న బాసర త్రిబుల్ ఐటీలో ప్రవేశానికి నోటిఫికేషన్

బాసర, మే 26: బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెజ్జి టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) 2025-26 లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల కానుందని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈనెల 28న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రవేశాల షెడ్యూల్ త్వరలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు . వివరాలకు, తాజా సమాచారం కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను www.rgukt.ac.inని సందర్శించాలని సూచించారు.

ప్రతి ఒక్క ఫిర్యాదును పరిష్కరించాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, మే 26: పోలీస్ స్టేషన్‌కు వచ్చే, పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన ప్రతి ఒక్క ఫిర్యాదును కచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందికి ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు.

సమస్యలను విన్న జిల్లా ఎస్పీ త్వరితగతిన మూర్తి చేసి పరిష్కరించాలని ఫోన్ ద్వారా సిబ్బందికి ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 40 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. మోసం జరిగిన వెంటనే సరైన దర్యాప్తును పూర్తి చేసి సంబంధిత వారిపై కేసులను నమోదు చేయాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే జిల్లా పోలీసుల పట్ల గౌరవం, నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల కూడా సమాన రీతిలో వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు.

నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

-నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం చేయాలి
-రాష్ట్ర డీజీపీకి బీజేపీ ఎస్టి మోర్చా రాష్ట్ర బృందం ఫిర్యాదు

హైదరాబాద్ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ డిజిపి కార్యాలయంలో డిజిపి జితేందర్ రెడ్డి నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ? బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర బృందం డీజీపీకి ఫిర్యాదు చేసింది.ములుగు జిల్లా వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం కల్పించాలంటూ, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర బృందం ఈరోజు రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేసింది.ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ "గత కొద్ది నెలలుగా ఎఓఏంబెంబొ, ఊమెఇఅఊ, ఽంజఇఖీ, ఎఇఏ వంటి కంపెనీలు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే ఈ మోసాలు జరుగుతున్నాయి. నాణ్యమైన విత్తనాలపై భరోసా ఉంచిన గిరిజన రైతులు పూర్తిగా నష్టపోయారు. అప్పుల్లో కూరుకుపోయిన కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇది కేవలం వ్యవసాయ విఫలత కాదు .. అమాయక గిరిజనులపై అవినీతి రాష్ట్ర ప్రభుత్వ కుట్ర. బాధ్యులైన కంపెనీలపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇటువంటి మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలి," అని తెలిపారు. 1. 3000 ఎకరాలు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి 800 వందల మంది గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి మరియు చనిపోయిన 5 గురు రైతుల కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. 2. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై మనీలాండరింగ్ యాక్ట్ , అలాగే యజమానులపై పీడియాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. 3. బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలి.

4. భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డిమండ్ చెసారు. "మంత్రి సీతక్క గారికి ఇసుక క్వారీలపై ఉన్న శ్రద్ధ, అందాల పోటీలపై ఉన్న ఆసక్తి గిరిజన రైతుల ఆత్మహత్యలపై ఏమాత్రం లేదని, వ్యవసాయ శాఖ మంత్రి కూడా స్పందించలేదని, ముఖ్యమంత్రి సమీక్షలు చేస్తున్నా, గిరిజన రైతుల విషయంలో పూర్తిగా విస్మరించారని, మంత్రివర్గంలో ఒక్క గిరిజన మంత్రిని కూడా నియమించని ఈ ప్రభుత్వ ధోరణి గిరిజనుల పట్ల అవమానకరంగా ఉంది," అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ నేనావత్,రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్,మహేష్ రూపావత్,బానోత్ అనూష,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డబల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధిలో అద్భుతాలు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికారి ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్

న్యూఢిల్లీ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు పాలనలో జనసేన టిడిపి బిజెపి కూటమి ప్రభుత్వం వల్ల అభివృద్ధిలో అద్భుతాలు జరుగుతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ అన్నారు 27 28 29 మే కడపలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతం కావాలని ఈ సమావేశాల్లో రాష్ట్రం అభివృద్ధి కోసం గతంలో అనేక అద్భుతమైన పథకాలు పనులు చేసిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు ఈ మహానాడు కార్యక్రమంలో కూడా మంచి మంచి ఆలోచనలు తీర్మానంలో పెట్టి రాష్ట్ర అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందడుగు వేయించే పని చేపట్టాలని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు మహానాడు శుభాకాంక్షలు తెలియజేశారు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారకరామారావు గారు మాజీ ముఖ్యమంత్రి వర్యులు దేశంలోనే అనేక సంస్కరణలు తీసుకొచ్చి పేదవాడి కోసం పనిచేసిన పార్టీగా మహిళా పక్షపాతిగా దేశంలో రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చిన నేతగా తెలుగువాడికి గుర్తింపు తెచ్చిన తెలుగు మహానీయుల ఎన్టీ రామారావు గారిని గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు సంస్కరణలు అభివృద్ధి సంక్షేమంతో పాటుగా అమరావతి రాజధాని పోలవరం నిర్మాణాలు పనులు ప్రారంభించి భవిష్యత్తుపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం కలిగిస్తున్నారని ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు నీతి నిజాయితీ తో పాటుగా గొప్ప దేశభక్తుడిగా యువతకి రాష్ట్రంలో ప్రేరణగా నిలుస్తున్నారని యువగళం ద్వారా పబ్లిక్ యూనివర్సిటీలో నాయకుడిగా మెరుగైన ఫలితాలు వచ్చి మంత్రిగా యువత కోసం అనేక ఉపాధి అవకాశాలను పరిశ్రమలను రాష్ట్రంలో వచ్చేటట్టుగా కష్టపడుతున్న నారా లోకేష్ గారు రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు నమ్మకం కలిగించే విధంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నారని వేణుమాధవ్ అన్నారు 56% దేశ బీసీ ప్రజల కలలను ప్రధాని మోడీ ముందుకు తీసుకు వెళు తున్నారు దేశంలో 80 కోట్ల మంది ఉన్న బీసీల అన్ని రాజకీయ పార్టీల డిమాండ్ జన గణనలో కులగణన చేయాలని అంశంపై భారతీయ జనతా పార్టీ ఎన్డీఏ ప్రభుత్వం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి క్యాబినెట్లో జనగణలో కుల గణాన చేస్తాము అని తీర్మానం చేయడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ ప్రధాని నరేంద్ర మో